### వార్తాప్రభ - పంచాంగం

**22-10-2024 మంగళవారం**

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షఋతువు, శ్రావణమాసం, కృష్ణపక్షం. ఆషాఢమాసం, శుక్లపక్షం

తిథి : షష్ఠి 01:29 వరకు
నక్షత్రం : ఆరుద్ర 05:38 వరకు
వర్జ్యం : 12:01 నుండి 01:28 వరకు
దుర్ముహూర్తం : 08:20 నుండి 09:06 వరకు
రాహుకాలం : 04:23 నుండి 05:50 వరకు
మంచి సమయం : 12:39 నుండి 02:10 వరకు
సూర్యోదయం : 5:57 కి
సూర్యాస్తమయం : 5:39 కి

# ధాన్యం కొనుగోలుపై టెక్నికల్ మరియు డేటా ఆపరేటర్లకు శిక్షణ



**ఆగిరిపల్లి, అక్టోబరు 21 (వార్తాప్రభ) :** మండల వ్యవసాయ శాఖ నేతృత్వంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్చార్జిలకు, టెక్నికల్ అసిస్టెంట్లకు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు, ఆర్ ఎస్ కె ఇన్చార్జిలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సివిల్ సప్లై జిల్లా టెక్నికల్ అసిస్టెంట్ ప్రవంతి మాట్లాడుతూ టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల కు విధులు గురించి , తేమశాతం ఎంత ఉండాలి, ధాన్యం కొనుగోలు చేసేటప్పుడు ఏ ఏ జాగ్రత్తలు పాటించాలన్న విషయాలను వివరించారు.ఆగిరిపల్లి మండలంలోని 23 రెవెన్యూ గ్రామాలను 9 క్లస్టర్ లుగా చేసి, 9 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆగిరిపల్లి ,చొప్పర మెట్ల, ఈదులగూడెం, సూరవరం ,నరసింగపాలెం, అడవినెక్కలం, బొద్దనపల్లి, నూగొండపల్లి , ఈదర-1 రైతు సేవ కేంద్రాల్లో ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాలను, పిఏసిఎస్ మరియు డీసీఎంఎస్ ల ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమం లో పాల్గొన్న మండల వ్యవసాయ శాఖ అధికారి పలగాని చెన్నారావు మాట్లాడుతూ వరి పండించి ఈ క్రాప్, ఈకేవైసీలు పూర్తి అయిన రైతులందరూ ఆర్ ఎస్ కెలను సంప్రదించి, ప్రమాణాలు పాటించి, తమ ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించుకోవాలని తెలిపారు. రైతులందరూ తేమశాతం తదితర ప్రమాణాలను పాటించి (రైతు సేవ కేంద్రాలను) సంప్రదించి తమ ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని డిప్యూటీ తాసిల్దార్ జి పవన్ కుమార్ తెలిపారు.

# ఆర్డీవోను మర్యాదపూర్వకంగా కలిసిన కరీముల్లా



**నందిగామ,అక్టోబరు 21 (వార్తాప్రభ) :** రెవెన్యూ డివిజన్ ఆఫీసర్ గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కే బాలకృష్ణను పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఏచూరి రాముతో కలిసి రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి షేక్ కరీముల్లా సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కరీముల్లా ఆర్డీవో బాలకృష్ణను దృశ్శాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేశం పార్టీ నాయకులు షేక్ అసిమ్ భాష, షేక్ ఇమామ్ లు పాల్గొన్నారు.

# ఇచ్ఛాపురం వరకు మూడు ఆర్టీసీ సర్వీసులు ప్రారంభించిన మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం,అక్టోబరు 21 (వార్తాప్రభ) :** రామచంద్రపురం నుంచి చుట్టుపక్కల గ్రామాలకు విద్యార్థుల సౌకర్యార్థం ఉదయం సాయంత్రం వేళలలో బస్సులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. సోమవారం రామచంద్రపురం ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో రామచంద్రపురం నుంచి ఇచ్ఛాపురం వయా విశాఖపట్నం వెళ్లే 40 సీట్లు గల మూడు అల్ట్రా డీలక్స్ బస్సులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికుల సౌకర్యార్థం రామచంద్రపురం నుంచి ఇచ్ఛాపురం వరకు 40 సీట్లు గల మూడు ఆర్టీసీ బస్సులను ప్రారంభించారు.ఈ బస్సులు ఉదయం, సాయంత్రం వేళలో రామచంద్రపురం నుంచి బయలుదేరుతాయన్నారు. రామచంద్రపురం నుంచి భద్రాచలం కి ఆర్టీసీ బస్సులు నడపాలని ప్రజల నుంచి అర్జీలు వస్తున్నాయని.. సంబంధిత విషయాన్ని ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి బస్సు సర్వీసును ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.చుట్టుపక్కల గ్రామాల నుంచి రామచంద్రపురం వచ్చి చదువుకుంటున్న విద్యార్థులు రాత్రి సమయాలలో బస్సులు, ఆటోలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి వచ్చిన నేపథ్యంలో అతి త్వరలో వి ఎస్ ఎం కాలేజీ నుంచి చుట్టుపక్కల గ్రామాలకు బస్సులు నడిచేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులకు తెలిపారు. రాబోయే రోజుల్లో రామచంద్రపురం నుంచి సుదూర ప్రాంతాలకు మరిన్ని బస్సు సర్వీసులు ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో డి పి టి ఓ శ్రీనివాసరావు , డి ఎం.భాస్కర్ ,విజిలెన్స్ అధికారి రామారావు,ఏఎంఎఫ్ రవిబాబు, రామచంద్రాపురం డిపో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భావన్నారాయణ స్వామి ఆలయం అభివృద్ధికి రూ.4.50లక్షలు విరాళం



**కాకినాడ రూరల్,అక్టోబరు 21 (వార్తాప్రభ) :** కాకినాడ రూరల్ మండలం సర్పవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ భావనారాయణ స్వామి దేవస్థానం అభివృద్ధికోసం ఏం గ్రీన్ ఇండియా ప్రవైట్ లిమిటెడ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ సి.హెచ్ .అనిల్ కుమార్ తమ ప్రతినిధుల ద్వారా సోమవారం ఆలయ కార్యనిర్వహణ అధికారి (గ్రేడ్ -1) ఎం.లక్ష్మి నారాయణకు రూ.4,50.000ల చెక్కు అందజేశారు.ఆలయ అర్చకులు కంపెనీ ప్రతినిధులకు ఆలయ మర్యాదలతో స్వామి వారి దర్శనం చేయించి ఆశీర్వాదాలు అందజేశారు.ఈ సందర్భంగా భావనారాయణ స్వామి చరిత్ర.విశిష్టతను వివరించారు. భావనారాయణ స్వామి ఆలయ అభివృధికి తోడ్పాటు కోసం విరాళం అందించిన ఏం ఇండియా కంపెనీ మేనేజింగ్ డైరెక్టరుకు కృతజ్ఞతలను ఆలయ కార్యదర్శి లక్ష్మీనారాయణ తెలిపారు.కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# కీ.శే పల్లపాటి మంగతాయారు పుట్టినరోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం



**మచిలీపట్నం,అక్టోబరు 21 (వార్తాప్రభ) :** మచిలీపట్నం యాదవ సంఘం అధ్యక్షులు చినబాబు సతీమణి దివంగత పల్లపాటి మంగతాయారు(లేటు) పుట్టినరోజు సందర్భంగా ఆనందాశ్రమం రాజుపేట వృద్ధాశ్రమం లో ఉన్న వారికి భోజ నం ఏర్పాట్లు చేశారు. భర్త పల్లపాటి వెంకట్రావు(చిన్న బాబు), వృద్ధులకు మిఠాయిలు, పండ్లు పంచి పెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో నేలపాల రామకృష్ణ, ఎంపరాల సత్యనారాయణ, సంద్రం సూర్యప్రకాష్, కోక మహేష్, డి తిరుమలాదేవి, లావణ్య, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

# ఏకేటిపి స్కూల్ లో "నాడు - నేడు" పథకంలో జరిగిన అవినీతి అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

- ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు షేక్ మౌలాలి డిమాండ్



**విజయవాడ,అక్టోబరు 21 (వార్తాప్రభ) :** అవినీతి అక్రమాల మయంగా ఉన్న నాడు నేడు పథకంలో నగరపాలక సంస్థ స్కూళ్ళ అభివృద్ధి పనులపై పాలకులు తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు షేక్ మౌలాలి డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం సత్యనారాయణపురం లోని ఏకేటిపి నగరపాలక సంస్థ హైస్కూల్ లో నాడు నేడు పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనులలో నెలకొన్న అవినీతి అక్రమాలపై పరిశీలన చేసిన అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మౌలాలి మాట్లాడుతూ ఏకేటిపి హైస్కూల్ అభివృద్ధి కోసం గత రాష్ట్ర ప్రభుత్వం రెండు కోట్ల ఎనిమిది లక్ష రూపాయలు మంజూరు చేయగా, సకాలంలో వాటిని వినియోగించి ఆయాభివృద్ధి పనులను పూర్తి చేయాల్సి ఉండగా, ప్రస్తుతం ఆయా అభివృద్ధి పనుల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం నెలకొనడమే కాకుండా, ఉపయోగించిన నిధుల వినియోగంపై కూడా అనేక అవకతవకలు నెలకొన్నాయని పేర్కొన్నారు. కేవలం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పనితీరు పై అనేక అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. సకాలంలో పూర్తి కావలసిన అభివృద్ధి పనులు పూర్తి కాకపోవడంతో వందలాది మంది విద్యార్థులు ఆయా సౌకర్యాలు అందుబాటులో లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. విద్యాభివృద్ధి కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలను అమలు చేస్తూ నిధులు మంజూరు చేస్తున్నా, ఆ నిధులను వినియోగించాల్సిన స్కూల్ హెచ్ఎం, విద్యా కమిటీ ల నిర్లక్ష్యంతో పాటు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న వైనంతో ఆ పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థుల విద్యాభ్యున్నతి కుంటుపడి వారి భవిష్యత్తు అగమ్య గోచరంగా మారిందని, ఈ విషయాలను విశదీకరిస్తూ ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్ లకు వినతి పత్రాలను అందించి నెలలు గడుస్తున్నా తదుపరి చర్యలు లేకపోవడం శోచనీయమని, ఇప్పటికైనా పాలకులు స్పందించకపోతే అవినీతి అక్రమార్కులకు ఈ ప్రభుత్వం కూడా మద్దతు తెలిపి అండగా ఉంటున్నట్టేనా అని ప్రశ్నించారు. డిజిటల్ విద్యా బోధన విధానానికి ఉపయోగించే 50 లక్షల రూపాయలు విలువైనవి సాంకేతిక పరికరాలు ఇప్పటికీ విద్యార్థులకు అందుబాటులో లేకపోవడంను పరిశీలిస్తే నాడు నేడు పథకం అమలు ఏ తీరుగ జరుగుతుందో అవగతం చేసుకోవచ్చని అన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి సత్యనారాయణపురం ఏ కె టి పి నగరపాలక సంస్థ పాఠశాలలో జరిగిన జరుగుతున్న అవినీతక్రమాలపై విచారణ జరిపించి అవినీతి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ మీడియా సెక్రెటరీ సద్దాం హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# రజక వృత్తి దారుల సమస్యలు పరిష్కరించాలి

- వచ్చే ఏడాది విజయవాడలో ఏడవ రాష్ట్ర మహాసభలు
- ఖాళీగా ఉన్న దోబీ పోస్టులను భర్తీ చేయాలి




**కాకినాడ,అక్టోబరు 21 (వార్తాప్రభ) :** కూటమిలోని టీడీపీ ప్రభుత్వం వృత్తిదారులకు ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలు అమలు జరపాలని, గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్పొరేషన్ను రద్దుచేసి ఫెడరేషన్లో ఉన్న రజక సంఘాలకు బ్యాంకులతో సంబంధం లేకుండా 30 లక్షల రూపాయలను విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం కాకినాడలోని సిఐటియు కార్యాలయంలో వృత్తిదారుల సంఘం కమిటీ ఆధ్వర్యంలో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం భాస్కరయ్య మాట్లాడుతూ రజకులకు సామాజిక రక్షణ చట్టం ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మాదిరిగా వెంటనే ఏర్పాటు చేయాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న దోబీ పోస్టులు భర్తీ చేసి రజక కుటుంబాల్లో ఉన్న యువతకు ఉపాధి కల్పించాలంటటూ భాస్కరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో చేతివృత్తిదారులు, బీసీలకు రక్షణ చట్టం ఏర్పాటు చేస్తానని, 50 ఏళ్లకే నాలుగు వేల రూపాయలు ఫించన్ ఇస్తానని, బీసీ డిక్లరేషన్ ద్వారా బీసీ సబ్ ప్లాన్తో ఐదు ఏళ్లలో లక్ష కోట్లు ఖర్చు చేస్తానని చెప్పిన మాట ప్రకారం స్కిల్ డెవలప్మెంట్ ద్వారా ఆ ప్రయత్నం వెంటనే ప్రారంభించాలన్నారు. రజక వృత్తిదారుల పిల్లలకు ఉపాధి కల్పించే విధంగా రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ధోబీ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, వృత్తిదారులకు ఇస్త్రీ చేసేందుకు ప్రభుత్వం చెప్పిన విధంగా 200 యూనిట్లు ఉచిత కరెంటు ఇవ్వాలని, మోడ్రన్ ధోబిఘాట్లు ఏర్పాటు చేసి రజక వృత్తిదారులకు తోడ్పాటు అందించాలన్నారు. వచ్చే 2025 మార్చిలో అమరావతి ప్రాంతంలో జరిగే 7వ రాష్ట్ర మహాసభలో పలు అంశాలపై చర్చించి రజకులకు అండగా నిలబడి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు నిరసన కార్యక్రమాలు ప్రారంభిస్తామని భాస్కరయ్య పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షులు సి గురు శేఖర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం అన్ని రంగాల్లో ప్రజలను మోసం చేసిందని ఈ ప్రభుత్వమైనా చెప్పిన మాట నిలబెట్టుకోవాలని విశ్వకర్మ కౌశల్య యోజన పథకం లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో అధికారులకు అప్పజెప్పాలన్నారు. నగర, గ్రామీణ ప్రాంతాల్లో రజక స్థలాలు ప్రభుత్వానికి చెందిన నాయకులు ఆక్రమించుకున్నారని వాటిని రక్షించి తిరిగి రజకులకు పూర్తి హక్కులతో ఇవ్వాలన్నారు. అలాగే బట్టలు ఉతికేందుకు ఒక చెరువును ఇవ్వాలని దానిపై రజకులకే అధికారాలు ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని గురుశేఖర్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాకినాడ జిల్లా అధ్యక్షులు కోనేటి రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మడక రాజు, రాష్ట్ర కోశాధికారి వల్లభాపురం వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పాగోలు శ్రీనివాసులు, సూగూరు శేషాద్రి, రాయల మాలకొండయ్య, ఆవులమంద రమణమ్మ, కొజ్జవరపు మాణిక్యం, పోలేపల్లి శ్రీనివాసులు, తదితర నాయకులు పాల్గొన్నారు.

# గ్రామ గ్రామాన అందుబాటులో ఆధార్ సేవలు - ఎంపీడీవో చిన్న రాట్నాలు



**విస్సన్నపేట,అక్టోబరు 21 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో 22వ తేదీ నుండి 25వ తేదీ వరకు ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో చిన్న రాట్నాలు మీడియా సమావేశంలో తెలిపారు. 22వ తేదీ విస్సన్నపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని 23వ తేదీ చంద్రుపట్ల లంబాడి తండా తెల్లదేవరపల్లి పుట్రెల గ్రామాల పరిధిలోను 24వ తేదీ వేమిరెడ్డిపల్లి కొర్లమండ కలగర మారేమండ గ్రామ పంచాయతీల పరిధిలో ఆధార్ సేవలు అందిస్తామని 25వ తేదీ నరసాపురం తాతకుంట్ల కొండ పర్వ సచివాలయాలలో ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని అని చెప్పారు. ఆధార్ సంబంధిత సేవలను ప్రజల వినియోగించుకోవాల్సిందిగా ఎంపీడీవో విజ్ఞప్తి చేశారు.

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి:సిఐ పెద్దిరాజు




**కాకినాడ రూరల్,అక్టోబరు 21 (వార్తాప్రభ) :** ఆధునిక పరిజ్ఞానం పెరిగిన తర్వాత సమాజంలో మోసాలు కూడా అధికమవుతున్న ందున అప్రమత్తంగా ఉండాలని సర్పవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.పెద్దిరాజు పేర్కొన్నారు.స్థానిక బోట్ క్లబ్ ఉద్యానవనంలో జరిగిన అవగాహన సదస్సు ఉద్దేశించి ఆయన మాట్లాడారు.సెల్ ఫోన్లలో అవతలి వ్యక్తి ఎవరో తెలియకుండా మాట్లాడటం తరువాత మోసాలకు గురికావడం జరుగుతుందని అన్నారు.బ్యాంకు ఓటీడీలు,ఆన్ లైన్ ఆర్థిక మోసాలు,జూదం, బెట్టింగ్, ఆన్ లైన్ రుణాలు తదితర మోసాలు జరుగుతున్నందున ఎవరైనా ఫోన్ చేసి ఓటీటీ చెప్పమని అడిగినా చెప్పరాదని అన్నారు.దొంగతనాలు కూడా అధికంగా జరుగుతున్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. నాలుగైదు రోజులకు మించి ఏదైనా ఊరు వెళితే స్థానిక పోలీసు స్టేషన్లో సమాచారం ఇవ్వాలని అన్నారు. అదేవిధంగా చదువుకున్న పలువురు యువకులు దురలవాట్లకు లోనయ్యి వాహనాలను దొంగిలించడం,మహిళల మెడలో బంగారు వస్తువులను దొంగిలించడం చేస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని అన్నారు. మైనర్లకు కార్లు,బైకులు వంటి వాహనాలు ఇవ్వరాదని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే ఏదైనా ప్రమాదం ఆ నష్ట పరిహారాన్ని వాహన యజమానులు ఇవ్వాల్సి ఉంటుందని పెద్దిరాజు తెలిపారు.వాకర్స్ సంఘ అధ్యక్షులు అడబాల రత్న ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వాకర్స్ పాల్గొన్నారు.

# గోమాతను పూజిస్తున్న ముస్లిం సోదరుడు



**వీరులపాడు, అక్టోబరు 21 (వార్తాప్రభ) :** మండలం జుజ్జూరు గ్రామానికి చెందిన ఆశ ఇంజనీరింగ్ వర్క్ యాజమాన్యం షేక్ హుస్సేన్ గోమాతలంటే అతనికి చాలా గౌరవం. గోమాతను10,500 కొనుగోలు చేశారు. గోవును గౌరీదేవితో పూజిస్తారు. గోవులను వధించడమే కాదు పూజకించడం కూడా తెలుసు అని నిరూపించిన ముస్లిం సోదరుడు. గోమాతను కాపాడుదాం, గోమాతను ఇంట్లో ఉంటే ఆరోగ్యంతో పాటు సుఖ సంతోషాలు ఉంటాయని షేక్ హుస్సేన్ అన్నారు.

# తహసిల్దార్ ను మర్యాదపూర్వకంగా కలిసిన డీలర్లు



**వీరులపాడు,అక్టోబరు 21 (వార్తాప్రభ) :** కొత్తగా వీరులపాడు మండలానికి వచ్చిన తాహాసిల్దార్ ని మండల రేషన్ డీలర్లు మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాసరావు, మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు జయరాజు, నంద్రు బాబురావు, సౌరి తదితరులు తాహాసిల్దార్ ను శుభాకాంక్షలు తెలియచేసారు.

# నాడు లిమ్కా బుక్ లో చోటు.. నేడు వానరాలతో చేటు



**విస్సన్నపేట,అక్టోబరు 21 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు రైతు ప్రసాద్ రెడ్డి అరటి తోటను వానరాలు విధ్వంసం చేయడం జరిగింది. వివరాలలోకి వెళితే రెండున్నర ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో వేసిన అరటిపంట కోతుల దాడితో విధ్వంసానికి గురైందని భారీ నష్టం వాటిల్లినట్లు ఆయన చెప్పారు. నాడు లిమ్కా బాటిల్స్ మూతలు నిమిషములో 76 మూతలు నోటితో తీయటంతో లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్ లలోకి ఎక్కి ప్రపంచవ్యాప్తంగా పేరు తెచ్చుకున్న ఆయన కపిరాజుల దాటికి తాను ఇష్టంగా పెంచుకునే అరటి పంట భారీగా నష్టపోవడం కొసమెరుపుగా చెప్పుకోవచ్చు



**శ్రీశైలం లోని శ్రీకృష్ణ యాదవ నిత్య అన్నదాన సత్రానికి విచ్చేసిన రాష్ట్ర పోలీసు అసోసియేషన్ నాయకులు,గుంటూరు జిల్లా సబ్ ఇన్స్పెక్టర్,యాదవ సామాజిక వర్గ శ్రేయోభిలాషి మర్రి సుబ్బారావు యాదవ్ ని నిర్వాహకులు సత్కరించిన చిత్రం**
**-శ్రీశైలం,అక్టోబరు 21 (వార్తాప్రభ) :**

# దేశ భవిష్యత్తు రూపొందబడే విద్యారంగం ప్రక్షాళనకు శ్రీకారం చుట్టాలి

- "ధర్మాసనం" చెప్పిన విధంగా ఉపాధ్యాయ సేవా నిబంధన లు రూపకల్పన జరగాలి
- విద్యా విధ్వంసాన్ని ఆపాలి -ఐక్యవేదిక విజ్ఞప్తి

**విజయవాడ,అక్టోబరు 21 (వార్తాప్రభ) :** దేశ భవిష్యత్తు రూపొందబడే విద్యారంగం ప్రక్షాళనకు శ్రీకారం చుట్టి,"ధర్మాసనం" చెప్పిన విధంగా ఉపాధ్యాయ సేవా నిబంధన లు రూపకల్పన చేయాలని, గత 25 సంవత్సరాలుగా జరుగుతున్న విద్యా విధ్వంసాన్ని ఆపాలని ఐక్యవేదిక చైర్మన్ కేఆర్. సూర్యనారాయణ, కో చైర్మన్ కరణం హరికృష్ణ, సెక్రటరీ జనరల్ బాజీ పఠాన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మాగంటి శ్రీనివాస రావులు లేఖ ద్వారా పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, సంచాలకుల వారిని విజ్ఞప్తి చేశారు. దేశ భవిష్యత్తును రూపకల్పన చేసే ఉపాధ్యాయులు శాశ్వత సేవా నిబంధనలు లేక కొట్టుమిట్టాడుతున్నారని వివరించారు. మానసిక వేదనకు గురవుతున్నారని విశదీకరించారు. అన్ని విభాగాల్లో క్రింది స్థాయి నుండి పైస్థాయి దాకా పదోన్నతులు పొందే సౌలభ్యం ఉందని సోదాహరిస్తూ ఉపాధ్యాయులకు పూర్తిస్థాయి సేవా నిబంధనలు లేకపోవడంతో ఎ క్యాడర్లో నియామకం పొందిన ఉపాధ్యాయులు అదే క్యాడర్లో పదవీ విరమణ పొందటం జరుగుతోందన్నారు. గత 25 సంవత్సరాలుగా ఉపాధ్యాయులు మానసిక వేదనకు గురవుతున్నారంటూ...ఇదే సందర్భంలో గత 25 సంవత్సరాలుగా విద్యారంగంలో బోధనేతర వ్యక్తులు చొరబడి ఉపాధ్యాయులు పొందాల్సిన పదోన్నతులన్నీ పొందుతూ.. విద్యా విధ్వంసాన్ని సృష్టిస్తున్నారని ఆరోపించారు. మనోవిజ్ఞాన శాస్త్రం చదవని బోధనేతర వ్యక్తులు డివిజన్/జిల్లా/ప్రాంతీయ విద్యా పర్యవేక్షకులుగా మారి కొఠారి కమిషన్, ముదిలియార్ కమిషన్ సిఫార్సులు,విద్యా హక్కు చట్టం అమలు చేయక.. విద్యారంగాన్ని నిర్వీర్యం చేశారని విశ్లేషించారు. ప్రైవేటు విద్యకు గేట్లు తెరిచారన్నారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా పదోన్నతులు కల్పించాలని "ధర్మాసనం" చెప్పిన విధంగా ఉపాధ్యాయ సేవా నిబంధనలు రూపొందించాలని కోరారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ కనుచూపు మేరలో వచ్చే అవకాశం లేదు. కావున యాజమాన్యం వారి ఉపాధ్యాయ సేవా నిబంధనలు రూపొందించాలని తెలిపారు. ప్రభుత్వ ఇతర విభాగాల మాదిరి ఉపాధ్యాయులకు క్రింది స్థాయి నుండి పై స్థాయి వరకు నిచ్చనమెట్ల పద్ధతిలో పదోన్నతి చానల్ ని రూపొందించాలన్నారు.యాజమాన్యం వారి పదోన్నతులు కల్పించాలి. విద్యారంగం లోని మండల/ డివిజన్/ జిల్లా /ప్రాంతీయ సంయుక్త సంచాలకుల వరకు మనోవిశ్లేషణ సిద్ధాంతము తెలిసిన, క్షేత్రస్థాయిలో బోధనా అనుభవం కలిగినటువంటి వారికి మాత్రమే పదోన్నతి కల్పించాలని పేర్కొంటూ.. విద్యారంగంలో పథకాలు అమలు చేయు సమగ్ర శిక్ష పర్యవేక్షకులుగా (ఎ. పి .సి )తదితర పోస్టులలో బోధనా అనుభవం కలిగిన వారికి మాత్రమే పదోన్నతి ద్వారా అనుమతించాలని చెప్పారు. పి.ఇ.ఒ (పరిషత్ ఎడ్యుకేషన్ ఆఫీసర్) పోస్టులు పునరుద్ధరించాలి. ఎం.పి.ఇ.ఒ (మండల పరిషత్ ఎడ్యుకేషన్ ఆఫీసర్) , జెడ్.పి.డి. ఇ.ఒ. (జిల్లా పరిషత్ డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పోస్టు)లను సృష్టించి వాటిని జిల్లా పరిషత్ ఉపాధ్యాయుల పదోన్నతి ద్వారానే భర్తీ చేయాలన్నారు.జిల్లా పరిషత్ ఉపాధ్యాయుల మండల/డివిజన్/ జిల్లా పరిపాలన, పర్యవేక్షణ పోస్టుల నందు జిల్లా పరిషత్ ఉపాధ్యాయుల నుండి మాత్రమే పదోన్నతి ద్వారా భర్తీ చేయాలి . అర్బన్ పోస్టులను ప్రభుత్వ ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించారన్నారు .o2 పాఠశాలలను జిల్లా పరిషత్ జూనియర్ కళాశాలలు గా పేరు మార్చాలని సూచించారు.భోదనేతర వ్యక్తులను ఉపాధ్యాయులపై , విద్యారంగా పథకాల అమలు పరిపాలనాధికారులు గా/పర్యవేక్షకులుగా నియమించరాదని పేర్కొన్నారు. జిల్లాకు ఒక జిల్లా పరిషత్ ఉపాధ్యాయ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తూ అందులో లెక్చరర్లుగా అర్హత కలిగిన జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించాలని విన్నవించారు. ప్రస్తుతం విద్యారంగంలో ఆంగ్లం ప్రాధాన్యత పెరిగిన నేపథ్యంలో ప్రతి జిల్లాలోనూ జిల్లా పరిషత్ హెచ్.ఎస్.ఇ.ఎల్ .టి.సి కేంద్రాన్ని ప్రారంభించి, పునరుద్ధరించి అర్హత కలిగిన జిల్లా పరిషత్తు ఉపాధ్యాయులకు హెచ్. ఎస్. ఇ. ఎల్ .టి .సి లెక్చరర్లుగా పదోన్నతి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. విద్యారంగంలో మనోవిజ్ఞాన శాస్త్రం ఏమాత్రం తెలియని బోధనేతరుల పర్యవేక్షణ, పరిపాలనా అధికారం, జోక్యం ను నివారించి దేశ భవిష్యత్తు రూపొందబడే విద్యారంగం ప్రక్షాళనకు శ్రీకారం చుట్టి, విద్యారంగాభివృద్ధికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు.

వార్తా ప్రభ
హైదరాబాద్

## మతసామరస్యానికి ప్రతీక గార్మి ఉత్సవాలు- కార్పొరేటర్ దొడ్ల



**కూకట్ పల్లి,అక్టోబర్ 21(వార్తప్రభ):**గార్మి ఉత్సవాలు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పేర్కొన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండలోని ఎన్టీఆర్ నగర్లో మైనారిటీ సీనియర్ నాయకులు ఫారూఖ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన గార్వి షరీఫ్ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ విచ్చేసి శుభాకాంక్షలు తెలియచేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు జి.రవి, పోశెట్టిగౌడ్,ఖలీమ్, మజర్, శివ,సత్తార్,పండు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ చెరువు లో రెండు కోట్ల ప్రజాధనం దుర్వినియోగం

**-బీజేవైఎం రాష్ట్ర నాయకులు కుమార్ యాదవ్**



**కూకట్ పల్లి,అక్టోబర్21(వార్తప్రభ):**ఎల్లమ్మ చెరువు లో రెండు కోట్లు పెట్టి చేపట్టిన సివరేజ్ డైవర్షన్ లైన్ ను బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్ స్థానికులతో కలిసి పరిశీలించి పనిచేసే వారితో మరియు ఇరిగేషన్ అధికారితో ఫోన్ లో మాట్లాడారు.ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ రెండు కోట్ల ప్రభుత్వ ధనంతో చేపట్టిన డ్రైనేజ్ లైన్ ప్రాజెక్టు దగ్గర సంబంధిత ఇంజనీర్ కానీ, కాంట్రాక్టర్,జిహెచ్ఎంసి అధికారులు, సివరేజ్ కి సంబంధించిన అధికారులు గాని లేకపోవడం బాధాకరం అన్నారు. ఇంజనీర్ అందుబాటులో ఉండి నాణ్యత ప్రమాణాలతో కూడిన పనులు చేయవలసిన ప్రాజెక్ట్ కూలీలుగా ఉన్న వారే పైప్ లైన్ పనులు ఇంజనీర్ లేకుండా చేయడం దుర్మార్గం అన్నారు. ఇది ముమ్మాటికీ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమే తప్ప అభివృద్ధి కార్యక్రమం కాదని అన్నారు. నామమాత్రపు పనులతో సరిపెట్టి అభివృద్ధి చేశామని గొప్పగా చెప్పుకునే ప్రజాప్రతినిధులు కూడా ఒక్కసారి ఆలోచన చెయ్యాలి అన్నారు. రెండు కోట్ల ప్రాజెక్టులో ఎవరి వాటా వారు తీసుకుని తూతూ మంత్రంగా స్పష్టత లేని డ్రైనేజ్ లైన్ పనులు చేస్తున్నారు అన్నారు. కాంట్రాక్టర్ సబ్ కాంట్రాక్టర్ కు ఇచ్చి పనులు చేపడుతున్నప్పుడు కాంట్రాక్టర్ కు ఎందుకు ప్రాజెక్ట్ అప్పజెప్పాలో సంబంధిత అధికారులు చెప్పాలి అన్నారు. అలాగే ప్రజా ప్రతినిధుల, సంబంధిత అధికారులు ఎల్లమ్మ చెరువును సుందరీ కరణ చేసి కబ్జాకు గురైన ప్రాంతాన్నికూడా కాపాడాలి అన్నారు.

## నూతన గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న బిజెపి రాష్ట్ర నేత వడ్డేపల్లి రాజేశ్వరరావు...



**కూకట్ పల్లి,అక్టోబర్21(వార్తప్రభ):**కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలోని బాలానగర్ డివిజన్ బిజెపి నాయకులు నరేందర్ గౌడ్ నూతన గృహప్రవేశ వేడుకలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలానగర్ బిజెపి నాయకులు నరేందర్ గౌడ్ ఆహ్వానం మేరకు వారి గృహప్రవేశ వేడుకలో పాల్గొని నరేందర్ గౌడ్ దంపతులను అభినందించి వారి కుటుంబ సభ్యులను ఆత్మీయంగా పలకరించారు.పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం నరేందర్ వడ్డేపల్లి రాజేశ్వరరావుని సన్మానించి కార్యక్రమానికి వచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేశారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే కుంభం



**వలిగొండ: అక్టోబర్ 21 (వార్తాప్రభ ప్రతినిధి)**మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో సోమవారం భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని నేరుగా తమ ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించి మద్దతు ధర పొందాలని అంతేకాకుండా ధాన్యం ఏ గ్రేడ్ వచ్చే విధంగా చూసుకోవాలని రైతులకు తెలిపారు రైతుల పక్షపాతి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని రైతులకు రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేశారని రాబోయే రోజుల్లో రైతుల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తారని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి మండల పట్టణ అధ్యక్షులు పాశం సత్తిరెడ్డి,కంకల కిష్టయ్య,నాయకులు కుంభం విద్యాసాగర్ రెడ్డి,భీమా నాయక్,గరిసె రవి,కొండూరు భాస్కర్,ఐటిపాముల రవీంద్ర,బత్తిని సహదేవ్,కాసుల వెంకన్న,రాచమల తిరుపతయ్య,బత్తిని నగేష్,కొండూరు సాయి,మైసొల్ల ప్రవీణ్,ఆదిమూలం సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# బోర్డుపై మోజుపడ్డ స్విమ్మింగ్ పూల్!!

- నెలల తరబడి మెడలో హారంగా అలంకారం
- ఈ బోర్డు తిప్పేది ఎన్నడు
- లాభాలపై ఉన్న శ్రద్ధ ఆరోగ్యంపై లేనే లేదు
- నెలల తరబడి ఇదే నిర్లక్ష్య ధోరణి
- సింగరేణి సార్ల పనితీరు మెరుగుపడేది ఎప్పుడు






**పెద్దపల్లి/ గోదావరిఖని: అక్టోబర్ 21 (వార్తాప్రభ ప్రతినిధి)**ఈ బోర్డు తిప్పేది ఎన్నడు అని తలను పట్టుకుంటున్నారు సింగరేణి కార్మికులు. ఎవరైనా కంపెనీ బోర్డు తిప్పేస్తే బాధపడతారు. కానీ ఇక్కడ ఈ కంపెనీ బోర్డు తిప్పితే మాత్రం సంబరపడతారు. ఎందుకో ఏమిటో ఈ కథనం పూర్తిగా చదవండి. గోదావరిఖని జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో ఏర్పాటుచేసిన స్విమ్మింగ్ పూల్ తరచూ ఈ బోర్డును మెడలో వేసుకుని అలంకరించుకుంటున్నది. వేసుకున్న ప్రతిసారి కనీసం మూడు నుంచి వారం రోజులు పాటు మోజు తీరేదాకా బోర్డు మెడలో నుంచి తీయదంటే అతిశయోక్తి కాదు. అయితే ఈసారి ఏకంగా మోజు పీక్స్ స్థాయిలో వెళ్లినట్లుంది ఆ స్విమ్మింగ్ పూల్ పరిస్థితి. సుమారు నెలన్నర నుండి ఈ బోర్డు తీయట్లేదు అంటే సమస్య ఏమిటో తెలుసుకుందాం. సింగరేణి సంస్థ కార్మికుల ఆరోగ్యం ఆహ్లాదం కొరకు స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేసినది. అయితే స్విమ్మింగ్ పూల్ లో తరచూ వాటర్, మోటర్, క్లోరినేషన్, క్లీనింగ్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఫిర్యాదు చేస్తే పట్టించుకున్న అధికారులు కనిపించరు. ఆ అధికారులకు లాభాలపై ఉన్న శ్రద్ధ ఆరోగ్యంపై లేనే లేదు అని కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నెలల తరబడి ఇదే నిర్లక్ష్య ధోరణి అని, సింగరేణి సార్ల పనితీరు మెరుగుపడేది ఎన్నడు అని ప్రశ్నిస్తున్నారు. వీలైనంత త్వరగా సమస్య పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకొని శాశ్వత పరిష్కారం చేసి స్విమ్మింగ్ పూల్ నిరంతరం కొనసాగేలా కార్మికుల ఆరోగ్యం, ఫిట్ నెస్, ఆహ్లాదంకు బ్రేక్ రాకుండా చూసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# పోలీసు అమరవీరుల త్యాగం అజరామరం..!!

- ఎండా, వాన, పగలు, రాత్రి తేడా లేకుండా పనిచేసేది పోలీస్
- శాంతిభద్రతలు బాగుంటేనే సమాజం అభివృద్ధి
- రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎం.శ్రీనివాస్





**పెద్దపల్లి/ గోదావరిఖని: అక్టోబర్ 21 (వార్తాప్రభ ప్రతినిధి)**పోలీసు అమరవీరుల త్యాగం అజరామరం..!! అని కొనియాడారు రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎం.శ్రీనివాస్. ఈ మేరకు సోమవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ ప్రాంగణంలో పోలీస్ అమరవీరుల దినోత్సవం ( పోలీస్ ఫ్లాగ్ డే ) ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా.....శాంతి భద్రతల పరిరక్షణలో అసువులు బాసిన పోలీసు అమర వీరుల త్యాగాలను అధికారులు స్మరించుకున్నారు. ఈ మేరకు సిపి మాట్లాడుతూ.... ఎండా, వాన, పగలు, రాత్రి తేడా లేకుండా పనిచేసేది పోలీస్ అని తెలిపారు. శాంతిభద్రతలు బాగుంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. అమరవీరుల స్పూర్తితో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు నేరరహిత సమాజ స్థాపనకు కృషి చేస్తామని ఈ సందర్భంగా సీపీ చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బెలిదే రమేష్ గుప్తను సన్మానించిన ... 250 మంది మహిళలతో

# రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు దివ్య లత

**జవహర్ నగర్, అక్టోబర్,21:(వార్తా ప్రభ)**మేడ్చల్ జిల్లా మహాసభ నూతన అధ్యక్షులుగా ప్రమాణస్వీకారం చేసిన రమేష్ గుప్త ను రెండు వందల యాభై మంది మహిళలతో కలిసి సన్మానించిన తెలంగాణ మహిళా శక్తి రాష్ట్ర అధ్యక్షురాలు మాడిశెట్టి దివ్యలత.ఈ సందర్భంగా దివ్యాలత మాట్లాడుతూ ఎంతో మందికి సేవలాందిస్తున్న రమేష్ గుప్త మరిన్ని ఉన్నంత పదవులను అధిరోహించాలని కిసర గుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి ఆశీస్సులతో పేద ప్రజలకు మరిన్ని సేవచేయ్యాలని నిత్యం వైశ్య సంఘానికే కాకుండా అన్ని వర్గాలకు అతని సేవలు అవసరమని అందరికి అండగా ఉండాలని ఆకాంక్షంచారు.ఈ కార్యక్రమంలో బుల్లి శ్రీనివాస్ గుప్త మేడ్చల్ జిల్లా ఆర్య వైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులు,తెలంగాణ మహిళా శక్తి సంగం మహిళలు, తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



# భార్గవ్ మినరల్స్ మెన్ పై పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ

- అడ్డుకున్న రెడ్లరేపాక గ్రామస్తులు
- నిలిచిపోయిన ప్రజాభిప్రాయ సేకరణ






**వలిగొండ: అక్టోబర్ 21 (వార్తాప్రభ ప్రతినిధి)**మండల పరిధిలోని రెడ్లరేపాక గ్రామ పరిధిలో గల మణిగండ్ల గుట్ట కోసం భార్గవ మినరల్స్ వారు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్న క్వార్జ్ మైన్ పై సోమవారం అడిషనల్ కలెక్టర్ బెన్ షాలోమి కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సంగీత ఆధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పర్యావరణ పరిరక్షణ వేత్తలు తమ అభిప్రాయాలు తెలియజేస్తుండగా క్వార్జ్ మైన్ ఏర్పాటు చేసే ప్రాంతం తమ రెడ్ల రేపాక గ్రామం పరిధిలో ఉందని తమకు తప్పుడు సమాచారం అందించి తమకు తెలియకుండా గుట్ట ప్రాంతంలో గ్రామస్తులు లేకుండా ప్రజాభిప్రాయాన్ని సేకరణ సరైంది కాదని వందలాది మంది గ్రామస్తులు అక్కడికి చేరుకొని ప్రజాభిప్రాయ సేకరణ అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు గందరగోళం నెలకొనగా అధికారులు, పోలీసులు కలగజేసుకొని ప్రజాభిప్రాయ సేకరణ నిలిపివేశారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ పరిధిలో గల మణిగండ్ల గుట్టపై క్వార్జ్ మైన్ ఏర్పాట్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని దీంతో పర్యావరణకు ముప్పు వాటిల్లుతుందని గొర్రెల పెంపకం దారులకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతుందని అరుదైన వృక్ష, జంతు జాతులు అంతరించిపోయే ప్రమాదం ఉందని కావున ఇక్కడ క్వార్జ్ మైన్ ఏర్పాటు చేయద్దని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు.క్వార్జ్ మైన్ పై పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ వద్ద చౌటుప్పల్ ఏసిపి మధుసూదన్ రెడ్డి, రామన్నపేట సిఐ వెంకటేశ్వర్లు,వలిగొండ ఎస్సై యుగంధర్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బెటాలియన్ తో బందోబస్తు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాశం సత్తిరెడ్డి,గుర్రం లక్ష్మారెడ్డి,మాదా శంకర్ గౌడ్,నోముల మల్లేష్ యాదవ్,దేశబోయిన సూర్యనారాయణ తో పాటు వందలాది మంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా పిర్యాదిదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్.పి. డివి శ్రీనివాసరావు.

**ఆసిఫాబాద్, అక్టోబర్ 21:(వార్త ప్రభ )** జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్.పి. డివి శ్రీనివాస్ రావు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేసారు. సోమవారం నాడు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్ ల యొక్క ఎస్ఐ , సిఐ లకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని మరియు పరిష్కారానికి సూచనలు చేసారు .ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకొనేల, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని జిల్లా ఎస్.పి. డివి శ్రీనివాస్ రావు తెలియజేశారు. ప్రజా సమస్యలు పై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నాము అని తెలిపారు .

## సులబ్ కాంప్లెక్స్ సిబ్బందికి సైతం బోనస్ ఇవ్వాలి!!

- సింగరేణి సంస్థ అందరినీ సమానంగా చూడాలి
- సాఫ్, సఫాయ్ చేసే కార్మికులపై చిన్న చూపు కుట్రపూరితం
- సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక నాయకులు శనిగల శ్రీనివాస్




**పెద్దపల్లి/ గోదావరిఖని: అక్టోబర్ 21 (వార్తాప్రభ ప్రతినిధి)**సులబ్ కాంప్లెక్స్ సిబ్బందికి సైతం బోనస్ ఇవ్వాలి అని డిమాండ్ చేశారు సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక నాయకులు శనిగల శ్రీనివాస్. ఈ సందర్భంగా నాయకులు మీడియాతో మాట్లాడుతూ.....సింగరేణి సంస్థ అందరినీ సమానంగా చూడాలి అని సూచించారు. సాఫ్, సఫాయ్ చేసే కార్మికులపై చిన్న చూపు కుట్రపూరితం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి సీ అండ్ ఎండి ప్రత్యేక ఆలోచన చేసి సులబ్ కాంప్లెక్స్ లో పనిచేస్తున్న సిబ్బందికి సైతం 5వేల రూపాయల బోనస్ తక్షణమే ప్రకటించాలని నాయకులు శ్రీనివాస్, కోట వెంకన్న డిమాండ్ చేశారు.

## బాలు(ని)కి బడా..... పోస్ట్!!

- రుడా ఏర్పాటు తర్వాత చైర్మన్ పదవి?
- ఫుల్ ఎక్స్పెక్టేషన్స్‌లో "వైట్ హౌస్" బ్యాచ్




**పెద్దపల్లి/ గోదావరిఖని: అక్టోబర్ 21 (వార్తాప్రభ ప్రతినిధి)**బాలు(ని)కి బడా..... పోస్ట్. రామగుండం ప్రాంతంలో గత శాసనసభ ఎన్నికలలో బాగా కష్టించి, ఎమ్మెల్యే బిగ్ విన్నింగ్ లో ప్రధాన పాత్ర పోషించిన ప్రస్తుత కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ ధీటి బాలరాజుకు రామగుండం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ( రుడా ) ఏర్పాటు చేసిన తర్వాత ఆ కార్పొరేషన్ చైర్మన్ గా బాధ్యతలు అప్పగిస్తే మరింత కష్టపడతాడు అని అతని ఫాలోవర్స్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. శాంత స్వభావిగా అందర్నీ కలుపుకొని పోయే మనస్తత్వం కలిగిన బిగ్ పర్సనాలిటీకి బడా పోస్ట్ ఇస్తే సీటు ఫుల్ ఫిల్ చేసినట్లు ఉంటుందని గోదావరిఖని ప్రధాన చౌరస్తాలోని వైట్ హౌస్ వేదికగా అంచనాలు వేస్తున్నారు. చూద్దాం ఎప్పుడు రుడాగా మారుతుందో.. ఆ చైర్మన్ పదవి బిగ్ పర్సనాలిటీకి దక్కుతుందో లేదో కాలమే సమాధానం చెబుతుంది అని మరికొందరు సింపుల్ గా తమ అభిప్రాయాలను చెప్పేస్తున్నారు.

## ఎమ్మెల్యే మందుల సామెల్ చిత్రపటానికి పాలాభిషేకం



**అడ్డగూడూర్: అక్టోబర్ 21 (వార్త ప్రభ )** అడ్డగూడూర్ మండల పరిధిలోని కోటమర్తి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే మందుల సామిల్ పలు గ్రామాలకు బీటీ రోడ్లు సాంక్షన్ చేయించిన సందర్భంగా గట్టు సింగారం నుండి ధర్మారం నుండి కోటమర్తి నుండి చిర్రగూడూర్ స్టేజి వరకు 9 కోట్ల రూపాయల నిధులతో బీటీ రోడ్డు సాంక్షన్ చేయించిన స్థానిక శాసనసభ్యులు మందుల సామిల్ చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాశం సత్యనారాయణ, గ్రామ శాఖ అధ్యక్షులు చిత్తలూరి సోమన్న, మాజీ సర్పంచి చిప్పలపల్లి బాలు, కోపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ వేముల బిక్షం , మాజీ వార్డ్ మెంబర్ గూడ సోమయ్య, చిత్తలూరి చంద్రమౌళి, గూడ శ్రీనివాస్, లచ్చయ్య, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేసిన ఆదర్శ యూత్ సభ్యులు



**వలిగొండ: అక్టోబర్ 21 (వార్తాప్రభ ప్రతి నిధి)** మండల కేంద్రంలోని ఖిలానగర్ చెందిన తోట కూరి చంద్రయ్య ఆకస్మిక ంగా మృతి చెందారు ఖిలానగర్ ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో 22900 రూపాయల ఆర్థిక సాయం అందజేసి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శి ంచారు.ఈ కార్యక్రమంలో ఎమ్మె లింగయ్య గ (పెద్దకుర్మ) బత్తిని దేవేందర్,ఎడవల్లి వినోద్,దయ్యాలా వినోద్,ఎమ్మె కుమార్,ఎమ్మె శేఖర్,కౌడె కృష్ణ,ఎమ్మె వెంకటేష్, ఎమ్మె నవీన్, పబ్బు శ్రీధర్ పాల్గొన్నారు.

# ఎడిటోరియల్

## అప్పగింతలు పూర్తి.. వైసీపీలో ఆరుస్తంభాలాట.. !

వైసీపీలో బాధ్యతలు అప్పగించడం పూర్తయిపోయింది. మొత్తం రాష్ట్రాన్ని ఆరు భాగాలుగా విభజించి.. ఆరుగురు కీలక నాయకులకు.. జగన్ అప్పగించేసిన విషయం తెలిసిందే. అయితే.. వీరిలో కొత్త మొఖాలు లేకపోవడం.. కొత్త సీసా అయినా.. పాతసారాతోనే నింపేయడం వంటి పరిణామాలు.. పార్టీలో తీవ్ర అసంతృప్తులకు దారి తీస్తున్నాయి. పైగా.. ఈ నేతలు.. ఎన్నికలకు ముందు అప్పగించిన బాధ్యతలను పూర్తిగా నెరవేర్చకపోవడం.. వారిపై నేతల్లో ముసురుకున్న తీవ్ర అసంతృప్తి వంటివి పెను వివాదంగా మారాయి.అయినా.. జగన్ మాత్రం ఆ ఆరుగురి చుట్టూనే పార్టీని తిప్పేస్తున్నారు. వారికే బాధ్యతలు అప్పగించేశారు. మొత్తంగా ఉమ్మడి జిల్లాలను ప్రామాణికంగా తీసుకుని.. ఆరు జిల్లాలుగా రాష్ట్రాన్ని విభజించి.. చేసిన నియామకాలపై వైసీపీ నేతల్లో పెదవి విరుపులే కనిపిస్తున్నాయి. అయితే.. గత ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించిన వాళ్లే.. వారివారి జిల్లాల్లో ఘోరంగా ఓటములు తెచ్చి పెట్టారు. అయితే.. ఇప్పుడు జిల్లాలు మార్చినా మళ్లీ వారికే బాధ్యతలివ్వడంతో వైసీపీ క్యాడర్‌లో అసహనం.. ఆగ్రహం రెండూ కనిపిస్తున్నాయి. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలకు ఎంపీ మిథున్ రెడ్డిని నియమించారు. గతంలో మిథున్ రెడ్డి గోదావరి జిల్లాలకు ఇంచార్జ్ గా ఉన్నారు. కానీ.. ఎన్నికల్లో ఈ రెండు జిల్లాల్లోనూ ఘోర పరాజయం పాలయ్యారు. మళ్లీ ఇప్పుడు మిథున్ రెడ్డిని కొత్త జిల్లాలకు అప్పగించారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు జిల్లాల ఇంచార్జ్ గా నియమించారు. ఈఏడాది ఎన్నికల్లో అనంతపురం, చిత్తూరు జిల్లాలకు ఇంచార్జ్ గా ఉన్నారు. కానీ, అక్కడ కూడా ఘోర పరాభవం ఎదురైంది. రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డిని ఉమ్మడి కృష్ణా జిల్లా ఇంచార్జ్‌గా నియమించారు. ఇక్కడ భిన్నమైననేపథ్యం ఉన్న నాయకులు ఉన్నారు. పైగా కీలక నేత సామినేని ఉదయ భాను పార్టీ ఫిరాయించారు. జోగి రమేష్ కూడా .. జంపింగుల జాబితాలో చేరిపోయారు. ఇప్పుడు ఈయనకు కత్తిపై సవాలే. వైవీ సుబ్బారెడ్డికి కడప, అనంతపురం, కర్నూల్ జిల్లాలకు ఇంచార్జ్ పదవి ఇచ్చారు. నిన్న మొన్నటి వరకు ఉత్తరాంధ్రలో తీవ్ర సెగను ఎదుర్కొన్నారు. పార్టీపైనా పట్టుకోల్పోయారు. ఇప్పుడు తీసుకువెళ్లి కీలక జిల్లాలకు ఇంచార్జ్‌ని చేశారు. అక్కడ ఢక్కాముక్కీలు తిన్న నాయకులు ఉన్నారు. వారు ఈయనను ఏమాత్రం ఖాతరు చేసే పరిస్థితి లేదని పార్టీలోనే చర్చ సాగుతోంది. విజయసాయిరెడ్డికి ఉమ్మడి విశాఖ, శ్రీకాకుళం జిల్లాలకు ఇంచార్జిని చేశారు. గతంలో ఈయన చేసినప్పుడు.. మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు ఈయనకు క్షణం కూడా పడేదికాదు. ఇలానే చాలా మంది నేతలు ఉన్నారు. ఇక, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ కు కూడా.. ఈయనంటే గిట్టదు. ఇప్పుడు ఏం చేస్తారో చూడాలి.ం మాజీ మంత్రి బొత్సకు ఉభయ గోదావరి జిల్లాల బాధ్యతలు ఇచ్చారు. ఈయనకు కూడా ఇక్కడ గట్టి సవాలే ఎదురు కానుంది. ఎలా చూసుకున్నా.. అన్నీ పాత ముఖాలే. మరి పార్టీ ఏమేరకు పుంజుకుంటుందో చూడాలి.

## సంగం పి.హెచ్.సి ని తనిఖీ చేసిన జిల్లా టీబీ మరియు లెప్రసీ అధికారి





**సంగం, అక్టోబర్ 21 (వార్త ప్రభ):** శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా సంగం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రమును జిల్లా టిబి మరియు లెప్రసీ అధికారి డాక్టర్ ఖాదరవల్లి గారు తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. తదుపరి సంగం పరిధిలో గల రాళ్లచెలిక ఏరియాలో అడల్ట్ బి.సి.జి వ్యాక్సినేషన్ను పరిశీలించి ఏఎన్ఎంకు తగిన సూచనలు ఇచ్చారు. ఈ బీ.సీ.జీ వ్యాక్సిన్ షుగర్ వ్యాధిగ్రస్తు లు ఎక్కువమంది వ్యాక్సిన్ వేసుకునేటట్లు ఆరోగ్య విద్య ద్వారా వారికి తెలియజేయాలని సూచించారు. వారం కంటే ఎక్కువ రోజులు దగ్గు జ్వరము ఉన్న వారిని గుర్తించి వారికి గళ్ళ పరీక్ష కొరకు ల్యాబ్ కి పంపించవలసినదిగా వివరించారు.ఈ కార్యక్రమంలో వారి వెంట వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీసు అమరవీరులకు జోహారు- ఎస్ఐ ప్రభాకర్



**చేజర్ల అక్టోబర్ 21 (వార్తాప్రభ)** మండల కేంద్రమైన చేజర్ల బస్టాండ్ ఆవరణలో సోమవారం మండల ఎస్సై ఎన్ ప్రభాకర్ మరియు వారి సిబ్బందితో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు ఆయన మాట్లాడుతూ పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ప్రాణ త్యాగం చేసిన అమరులను గుర్తు చేసుకుంటూ వారికి ఘన నివాళు లు అందిస్తున్నామని తెలిపారు.సమాజానికి పోలీసు పాత్ర చాలా గొప్పదని వారి తెలిపారు నిరంతరం సమాజ శ్రేయస్సు కోసం ప్రజల క్షేమం కోసం తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ ప్రజలకు దగ్గరగా మేమున్నాము అంటూ భరోసానిస్తూ రక్షణ కల్పిస్తున్నామని తెలిపారు. శాంతి భద్రతలను కాపాడటంలో ఎటువంటి ఆటంకాలు ఎదురైనా వెనకడుగు వేయమని పేర్కొన్నారు.గతంలో ఎంతో మంది గొప్ప గొప్ప వీరులు అమరులే మాకు స్ఫూర్తిదాయక మని తెలిపారు.నేటి సమాజంలో పోలీసు పాత్ర చాలా కీలకమైన దని పేర్కొన్నారు.ముందుగా స్థానిక పోలీస్ స్టేషన్ జిల్లా పరిషత్ హై స్కూల్ నుండి విద్యార్థులతో కలిసి బస్టాండ్ ఆవరణ వరకు ర్యాలీ నిర్వహించారు.

# శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం చుట్టూ సైడ్ కాలువలు ఏర్పాటు చేయాలి





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 21:(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని స్థానిక కొత్తపేటలోని శ్రీ వేణుగోపాల స్వామి వారి దేవస్థానం చుట్టూ సైడ్ కాలువలు లేకపోవడంతో ఆ ప్రాంతంలో తీవ్ర దుర్గంధ పూరిత వాతావరణం నెలకొంది. గతంలో ఉన్న కాలువను కార్పొరేషన్ సిబ్బంది పట్టించుకోక పోవడంతో ఆ కాలువలు మొత్తంగా పూడిక మట్టితో నిండిపోయి కాలువ ఆనమాలు లేకుండా పోయింది. దీంతో స్థానిక ప్రజలు దేవస్థానం చుట్టూతా ఉన్న ప్రహరీ వద్ద చెత్తాచెదారాలను పారవేస్తుండడంతో ఆ ప్రాంతంలో దుర్గంధపూరిత వాతావరణం నెలకొంది .కాగా ఇటీవల దేవస్థానం ప్రాంగణానికి అనుబంధంగా నిర్మించిన ఎనిమిది షాపుల వద్ద కాలువ లేకపోవడంతో ఇబ్బందికరమైన వాతావరణం నెలకొంది . విజయవాడ నగరపాలక సంస్థ ఆ ప్రాంతంలో సైడ్ కాలువల నిర్మాణాలను చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. కాలువల నిర్మాణం జరిగితే ఆ ప్రాంతాల్లో చెత్తాచెదారం నిలువ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసే వీలుంటుంది. ఈ విషయమై శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానం కమిటీ అధ్యక్షులు వంజరపు సూర్యారావు మాట్లాడుతూ దేవస్థానం చుట్టూతా విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సైడ్ కాలువల నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా దేవస్థానం చుట్టూ ప్రాంతం పరిశుభ్రంగా ఉండేందుకు అవకాశం ఉంటుందని ఆయన చెప్పారు. అలాగే దేవస్థానంనకు నిత్యం వచ్చే భక్తులు కూడా దేవస్థానం చుట్టూతా సైడ్ కాలువ నిర్మాణం చేపట్టాలని నగరపాలక సంస్థ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

# జగన్ పాలనలో చేతకాని అభివృద్ధి సీఎం చంద్రబాబు చేసి చూపిస్తున్నారు..అందుకే అసత్య ప్రచారం

- టిడిపి విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ కార్యదర్శికొట్టేటి హనుమంతురావు



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)** జగన్ తన పాలనలో చేతకాక వదిలిపెట్టిన అభివృద్ధి ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసి చూపిస్తుండటంతో ప్రజల ముందు తన చేతకాని తనాన్ని కప్పి పుచ్చుకునేందుకు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం పై వైసిపి ఎమ్మెల్యే జగన్ అసత్య ప్రచారం చేస్తున్నాడని టిడిపి విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ కార్యదర్శి, మాజీ ఫ్లోర్ లీడర్ కొట్టేటి హనుమంతురావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎమ్మెల్యే జగన్ రాష్ట్ర ప్రభుత్వం, సీఎం చంద్రబాబు పై చేస్తున్న అసత్య ప్రచారాలను ఖండిస్తూ సోమవారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొట్టేటి హనుమంతురావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రాష్ట్ర అభివృద్ధిని పక్కన పెట్టి మద్యం, ఇసుక ద్వారా దోచుకుతినటం, దాచుకోవటం మాత్రమే తెలిసిన ఎమ్మెల్యే జగన్ కి మాట్లాడే నైతిక హక్కు మాత్రమే కాదు. సీఎం చంద్రబాబు ను కూడా విమర్శించే అర్హత కూడా లేదన్నారు. గత ఐదేళ్లలో జగన్ తన జేబులు నింపుకోవటం కోసం ప్రజల ప్రాణాలు పట్టించుకోకుండా చీప్ లిక్కర్ పంపిణీ చేశాడన్నారు. రాష్ట్రంలో ఎంతో మంది ప్రాణాలు పోవటానికి జగన్ కంపెనీలు పంపిణీ చేసి చీప్ లిక్కరే కారణమని తెలిపారు. మద్యం రేట్లు పెంచి మద్యం ప్రియుల రక్తం పీల్చుకున్నారని విమర్శించారు. అందుబాటు ధరలకే నాణ్యమైన మద్యాన్నిఅందించాలనే ఉద్దేశ్యంతో సీఎం చంద్రబాబు నాయుడు ఒక పాలసీ తీసుకువస్తే ...రంగునీళ్లు పోసి సరఫరా చేస్తున్నారని ఎమ్మెల్యే జగన్ అసత్య ప్రచారం చేయటం తగదన్నారు. ప్రజలకి జగన్ పరిపాలనకి, సీఎం చంద్రబాబు పరిపాలనకి తేడా అర్ధమైంది. అందుకే జగన్ ఎన్ని విషపూరిత ప్రచారాలు చేసిన ప్రజలు నమ్మటానికి సిద్ధం లేరనే విషయం గ్రహించాలని హితబోధ చేశారు. జగన్ పాలనలో యాభై వేల పెట్టి కొనే లారీ ఇసుక... చంద్రబాబు ముఖ్యమంత్రిగా అధికారంలోకి రాగానే ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేసి ఎంతోమంది ప్రజలకు మేలు చేశాడన్నారు. జగన్ పాలనలో ఇసుక కొనలేక ఇబ్బంది పడ్డ పేద, మద్యతరగతి ప్రజలు ఉచిత ఇసుక విధానం రావటంతో ఊపిరి పీల్చుకుంటున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో రెచ్చిపోయిన అవినీతి, అరాచకాలు, భూదందాలు చేసిన అసాంఘిక శక్తులన్నింటికీ సీఎం చంద్రబాబు అడ్డుకట్ట వేస్తే..ఎమ్మెల్యే జగన్ రాష్ట్రంలో శాంతి భద్రతలు లేవని అనటం విడ్డూరం గా వుందన్నారు. ప్రజాదర్బర్ లో వస్తున్న ఫిర్యాదులు చూస్తే గత ఐదేళ్లలో జగన్ చేసిన అవినీతి, దౌర్జన్యాలు తెలుస్తాయన్నారు. అందుకే 151 సీట్లు ఇచ్చిన ప్రజలు 11 సీట్లు మాత్రమే ఇచ్చి పక్కన కూర్చొబెట్టిన జగన్ కి ఇంకా బుద్ధి రాలేదన్నారు. ఈ మీడియా సమావేశంలో అర్బన్ మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షుడు ఎమ్.డి.ఇర్ఫాన్ , ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అర్బన్ ఉపాధ్యక్షుడు దోమకొండ రవికుమార్ పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి

- విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర





**విజయవాడ పశ్చిమఅక్టోబర్ 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను శాఖాధిపతులే స్వయంగా పరిష్కరించాలని కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్ లో సోమవారం ఉదయం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను కమిషనర్ నిర్వహించారు. ఈ సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఏడు ఫిర్యాదులు అందాయని తెలిపారు. అందులో పన్ను సంబంధించి, అనధికార ఆక్రమణ గురించి, సిసి రోడ్ వేయుటకు, త్రాగునీటి సరఫరా కొరకు, దోబీ ఖానా వద్ద బడ్డీని తొలగించుటకు, కమ్యూనిటీ హాల్ తదితర అంశాలపై ఫిర్యాదులను కమిషనర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ శాఖధిపతులందరూ తమ తమ శాఖల్లో ఉన్న సచివాలయం సిబ్బందిని పర్యవేక్షిస్తూ ప్రతి సచివాలయం పరిధిలో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడం వల్ల ప్రజలకు ఎటువంటి సమస్య లేకుండా చూసుకోగలమని తెలిపారు.ఈ సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అసిస్టెంట్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ జి వి జి ఎస్ వి ప్రసాద్, చీఫ్ ఇంజనీర్ శ్రీనాథ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి సృజన, ఇంచార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, ఎస్ ఈ (వర్క్స్) పి సత్యనారాయణ, ఎస్ ఈ (ప్రాజెక్ట్స్) సత్యకుమారి, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మల్యాద్రి, ఎస్టేట్ ఆఫీసర్ టి శ్రీనివాస్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి సోమశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ప్రజా దర్బార్

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి



**కనిగిరి అక్టోబర్ 21 వార్తా ప్రభ ప్రతినిధి** కనిగిరి నియోజకవర్గం కనిగిరి పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో కనిగిరి మండల ప్రజా దర్బార్ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ఈ ప్రజా దర్బార్ అన్నారు. సామాన్య ప్రజలు పనులు పోగొట్టుకొని ప్రజాదర్బార్ కు వచ్చి వినతులు ఇచ్చారని వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ప్రజల నుంచి వినతులను స్వయంగా స్వీకరించారు. అధికారులు ప్రజల వినతులను స్వీకరించి వారి సమస్యలను పరిష్కారం అయ్యేలా చేయాలని ఆదేశించారు. తాను సంపాదన కోసం రాజకీయాల్లోకి రాలేదని, సేవ చేసేందుకు వచ్చానని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా కష్టపడదామని, సమస్యలపై వచ్చేవారికి పరిష్కార మార్గం చూపాలని, సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని, తప్పు చేసే అధికారులను ఉపేక్షించనని, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మాతృభూమి శ్రేయస్సు కోసం పనిచేసిన నిస్వార్థ శ్రామికులు పోలీసులు

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి




**కనిగిరి అక్టోబర్ 21 వార్తా ప్రభ ప్రతినిధి** కనిగిరి నియోజకవర్గం కనిగిరి పట్టణంలో పోలీస్ అమరవీరుల సంస్కరణ దినోత్సవం సందర్భంగా కనిగిరి పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఆవరణ నుంచి పోలీసులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రారంభించి పోలీస్ అమరవీరులకు నివాళులర్పించారు. ప్రజల మాన ప్రాణ రక్షణ కోసం ప్రాణాలు సైతం లెక్కచేయక అసువులు బాసిన పోలీసుల సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. 1958 అక్టోబర్ 21న చైనా సరిహద్దుల్లో దేశం కోసం తమ ప్రాణాలర్పించిన అమరవీరులకు నివాళులు అర్పిస్తూ పోలీసుల అమరవీరుల దినోత్సవం గా ప్రతి సంవత్సరం ఈరోజు జరుపుకోవడం జరుగుతుందని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కనిగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఖాజావలి, సర్కిల్ పరిధిలోని ఎస్సైలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సుజన చౌదరి ఆదేశాలతో సైడ్ డ్రెయిన్ పనుల ప్రారంభం

49 వ,డివిజనులో అభివృద్ధి పనులకు సంప్రదాయ పూజలు



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని49వ డివిజన్ పరిధిలోని పెనుమాక దేవదాసు వీధిలో బిజెపి కార్పొరేటర్ బుల్లా విజయ్ స్థానిక మహిళలతో కలిసి సోమవారం సైడ్ డ్రెయిన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ శాసనసభ్యులు యలమంచిలి సత్యనారాయణ (సుజన చౌదరి) ఆదేశాల మేరకు నాలుగున్నర లక్షల వ్యయంతో పెనుమాక దేవదాసు వీధిలోని సైడ్ డ్రైన్లకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. సైడ్ డ్రెయిన్ల నిర్మాణ పనులలో నాణ్యత, ప్రమాణాలు పాటించి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే సుజనా ఆదేశించారన్నారు. నియోజకవర్గ సమస్యలను పరిష్కరించడానికి ఎమ్మెల్యే సుజనా చౌదరి కృషి చేస్తున్నారని తెలిపారు.కార్యక్రమంలో ఏ ఈ ప్రసాద్, కూటమి నేతలు బడుగు వెంకన్న, కొమర కిరణ్, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## అమరుల త్యాగాన్ని గుర్తు చేసుకున్న పోలీసులు

- అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ చేపట్టిన సిఐ వేమారెడ్డి, ఎస్సై రాజేష్
- కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆత్మకూరు డిఎస్పి వేణుగోపాల్



**సంగం, అక్టోబర్ 21 (వార్తప్రభ):** శ్రీపొటి శ్రీరాములు నెల్లూరుజిల్లా సంగం మండలంలో పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా డీఎస్పీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో సీఐ వేమారెడ్డి, ఎస్సై రాజేష్ విద్యార్థుల తో ర్యాలీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిఎస్పీ వేణుగోపాల్ పాల్గొని పోలీస్ స్టేషన్ వద్ద జెండా ఊపి ర్యాలీను ప్రారంభించారు. పోలీస్ స్టేషన్ నుండి బస్ స్టాండ్ సెంటర్ వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పాటుచేసి పోలీస్ అమర వీరులకు నివాళులర్పించారు. వారు చేసిన త్యాగాల గురించి విద్యార్థులకు వివరించి విద్యార్థులకు మిఠాయిలు పంచి పెట్టారు.

## శ్రీ కనకదుర్గమ్మ నిత్యాన్నదాన ట్రస్ట్ కి రూ 1,11,111 చెక్కు అందజేత




**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో సోమవారం అయ్యప్ప నగర్, విజయవాడకు చెందిన కొల్లూరి విజయలక్ష్మి దంపతులు శ్రీ అమ్మవారి దేవస్థానం నందు జరుగు అన్నదానం నిమిత్తం ఆలయ ఈవో కె ఎస్ రామరావు, డిప్యూటీ ఈవో ఎం. రత్న రాజు లను కలిసి రూ. 1,11,111/- లను చెక్కు రూపములో విరాళంగా అందజేశారు. అనంతరం వీరికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి, వేదపండితులచే వేదార్వచనం కల్పించగా, ఆలయ ఈవో వీరికి అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం మరియు చిత్రపటం అందజేశారు.మరియు డోనార్ సెల్ ద్వారా వెంటనే వీరికి డోనార్ (ఎన్ ఎఫ్ సి టెక్నాలజీ) కార్డు కూడా అందజేశారు.

## నేటి నుంచి భూ సమస్యలపై గ్రామ సభలు

**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 21 (వార్తా ప్రభ ప్రతినిధి):** భూ సమస్యలపై గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ నెల 22న కొటికలపూడి, 23న మూలపాడు, 24న జమీ మాచవరం (కొటికలపూడి), 25న గూడురుపాడు (గుంటుపల్లి)లో గ్రామ సభలు ఉంటాయన్నారు. ఇందులో భూ విస్తీర్ణంలో వ్యత్యాసాలు, జాయింట్ ఎల్ పీఎం, ఖాతా నెంబర్ తప్పుగా నమోదవడం, పేర్లలో తప్పులు మొదలైన భూ సమస్యలపై అర్జీలు స్వీకరించనున్నట్లు చెప్పారు. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగే సభలకు రైతులు, భూ యజమానులు హాజరుకావాలని కోరారు.

# పౌర హక్కుల రక్షణలో పోలీసుల పాత్ర చిరస్మరణీయం

- విధి నిర్వహణలో ప్రాణాలొదిలిన పోలీసుల్ని స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది
- పోలీసు విధి అంటేనే కత్తిమీద సాములాంటిది
- పెరుగుతున్న నేరాలకు అనుగుణంగా పోలీసు వ్యవస్థను బలోపేతం చేస్తాం
- అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో మంత్రి కొల్లు రవీంద్ర



**మచిలీపట్నం అక్టోబర్ 21 (వార్తాప్రభ ప్రతినిధి)**విధి నిర్వహణలో ప్రాణాలొదిలిన పోలసులను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు %ఎ% ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన సంస్మరణ దినోత్సవంలో పాల్గొన్నారు. పోలీసు అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. పోలీసుల నుండి గౌరవ వందనం పొందారు. పోలీసుల సంక్షేమ నిధికి రూ.50 వేలు అందిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ప్రాణాలొదిలిన పోలీసుల త్యాగం మరచిపోలేనిది. 1959లో లద్దాఖ్‌లో చైనాతో జరిగిన యుద్ధంలో ప్రాణాలొదిలిన సైనికుల త్యాగాలకు చిహ్నంగా ఈ కార్యక్రమం నిర్వహించుకుంటున్నాం. ప్రతి ఏటా అక్టోబర్ 21న జరిగే ఈ కార్యక్రమంలో అసువులు బాసిన పోలీసులకు అంజలి ఘటించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. పోలీసు విధి అంటేనే కత్తిమీద సాములాంటిదని, అరాచక శక్తులప వారు చేసే పోరాటం తలచుకుంటేనే ఒళ్లు గగుర్పొడుస్తుందన్నారు. ప్రస్తుతం యుద్ధం కనిపించని శత్రువులతో చేయాల్సివస్తోందని, ప్రత్యేకంగా సైబర్ నేరాలపై చేయడం అత్యంత క్లిష్టతరంగా మారింది. మరోవైపు గంజాయి ముఠాలు, డ్రగ్స్ మాఫియాల నియంత్రణపై పోలీసుల పాత్ర ఎంతో కీలకం అన్నారు. నేరస్తులు అప్‌డేట్ అవుతున్నారు. నేరాలుకూడా కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఇన్ని రకాల అవాంతరాల మధ్య కూడ స్వేచ్ఛాయుత వాతావణంలో పౌర భద్రతపై పోలీసులు చూపిస్తున్న శ్రద్ధను కొనియాడారు. నేరస్తులను శిక్షించడం, బాధతులకు సత్వర న్యాయం చేయడం కోసం స్పెషల్ కోర్టులు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోంది. నేరాల నియంత్రణ, రీహేబిలిటేషన్ కోసం ఎక్సైజ్ శాఖ నుండి 2శాతం నిధులు కేటాయింపునకు సిద్ధంగా ఉన్నాం. అదే సమయంలో పోలీసులకు రక్షణ కల్పించేందుకు సిద్ధంగా న్నామని, వారి కోసం ప్రత్యేకంగా సహయ నిధి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. టెక్నాలీని అడాప్ట్ చేసుని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు ద్వారా రాష్ట్రంలోని సీసీ కెమెరాలన్నింటినీ మానిటర్ చేస్తున్నాం. నేరస్తుల నుండి రక్షణ కోసం పోలీసులకు బాడీవేర్ కెమెరాలు అందించబోతున్నాం. ప్రజల్ని కాపాడే పోలీసులను అరాచక శక్తుల నుండి కాపాడుకోవడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.

## ఫ్రెండ్లీ పోలీస్ కు సరైన నిర్వచనం ఇస్తున్న సంగం సీఐ

**ప్రజలు, వాహనదారుల ఇబ్బందిని తొలగించిన సంగం సీఐ వేమారెడ్డి**



**సంగం, అక్టోబర్ 21 (వార్తప్రభ):** శ్రీపొటి శ్రీరాములు నెల్లూరుజిల్లా సంగం మండల కేంద్రం లోని కెనరా బ్యాంక్ సమీపం లో రహదారి పై మురుగు నీరు చేరి వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవ)తున్నారు. పలుమార్లు వాహనదారులు ప్రజలు ఈ సమస్యను స్థానిక సీఐ వేమారెడ్డి దృష్టికి తీసుకెళ్ళారు. సీఐ వేమారెడ్డి మానవత్వం తో స్పందించి స్థానికుల సహాయం తో మురుగు నీటి తొలగింపుకు శ్రీకారం చుట్టారు. రహదారి పై దగ్గరుండి జేసిబి సహాయం తో రహదారి పక్కనే కాలువ తీయించి మురుగునీటిని అంతా తొలగించారు. రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో వాహనదారులు, ప్రయాణికులు సంగం ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వ అధికారులు అంటే కేవలం అధికారం చలయించటమే కాకుండా ప్రజలకు సేవ చేసే అధికారులు ఇలాంటి అధికారులు కావాలని ఇలాంటి అధికారుల వలన ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని ఫెండ్లి పోలీస్ కి సరైన నిర్వచనాన్ని ఇస్తున్నారని ప్రజలు అన్నారు. అలాగే ఇట్లాంటి మంచి పని చేస్తున్న సీఐ వేమారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## వీధి విక్రయదారులకు ఆర్థిక సహాయం చేయాలి

● బుడమేరు ముంపు లో విశేష సేవలు చేసిన పారిశుద్ధ్య కార్మికులకు ఒక నెల జీతం బోనస్ గా ఇవ్వాలి ● ఏ ఐ టి యూ సి నాయకుల బృందం తో కలిసి జి. కోటేశ్వరరావు వీఎంసి కమిషనర్ కి వినతిపత్రం అందజేత



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర కి మెమోరండంని నగర ఏఐటీయూసీ నాయకులు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు కమిషనర్ కి విజ్ఞప్తి చేస్తూ ఇటీవల వచ్చిన బుడమేరు ముంపు వలన మన నగరంలోని 32 డివిజన్లు జలదిగ్బంధమయ్యాయి అనే విషయం మీకు తెలిసినదే. రాష్ట్ర ప్రభుత్వము నష్టపోయిన వీధివిక్రయదారులను ఆర్థికంగా ఆదుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించడం జరిగింది. గతంలో హుద్ హూద్ తుఫాన్ వచ్చినప్పుడు విశాఖపట్నంలోని నష్టపోయిన తోపుడుబండ్లతో వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరికి పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగిందని. అదేవిధంగా నేడు విజయవాడ నగరంలో బుడమేరు ముంపు వలన నష్టపోయిన చిరు వ్యాపారులు తమ తోపుడు బళ్ళు కోల్పోయారు పళ్ళు, పువ్వులు, కూరగాయలు, పచ్చి సరుకు, మరియు ఇతర వస్తువులు కోల్పోయారు. వారిని ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం, నగరపాలక సంస్థ ద్వారా నష్టపరిహారం ఇవ్వాలని కోరడమైనది. అలాగే బుడిమేరు ముంపులో సేవలందించిన పారిశుద్ధ్య కార్మికులకు ఒక నెల జీతం బోనస్ గా ఇవ్వాలని కమిషనర్ శ్రీ ధ్యానచంద్ర ని కోరారు. మెమోరండం అందజేసిన వారిలో ఏఐటీయూసీ నగర అధ్యక్ష , కార్యదర్శులు కే.ఆర్.ఆంజనేయులు, మూలి.సాంబశివరావు ,వీధి విక్రయదారుల కార్మిక ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెడ్డు వెంకటేశ్వరరావు, నాయకులు సిహెచ్ఎల్వీపీ మారుతీ రావు, ఎక్కిలి కృష్ణ, కుమార్, భీమారావు, మల్లేశ్వరి, దివ్య, ఏ ఐ వై ఎఫ్ నగర నాయకులు లంకె సాయి తదితరులు ఉన్నారు.

## కృష్ణా జిల్లా పోలీస్ పెరేడ్ మైదానంలో ఘనంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

● ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర మంత్రివర్యులు కొల్లు రవీంద్ర , జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు



**మచిలీపట్నం అక్టోబర్ 21 (వార్తాప్రభ ప్రతినిధి)**మన నేటి కోసం తమ రేపటిని త్యాగం చేసి,ప్రజల ధన,మాన, ప్రాణ సంరక్షణ కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన పోలీస్ అమరవీరులందరికీ ఘనంగా నివాళులర్పిస్తూ సోమవారం జిల్లా పోలీస్ పెరేడ్ మైదానంలో అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర మంత్రివర్యులు కొల్లు రవీంద్ర , జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. మొదటగా పెరేడ్ కమాండర్ ఆర్ఐ సతీష్ గౌరవ వందనం సమర్పించి స్వాగతం పలికారు. అనంతరం దేశవ్యాప్తంగా అమరులైన పోలీస్ సిబ్బంది కి సంబంధించిన పేర్లను పుస్తక్ టోలి తో ఆర్ఎస్ఐ వర్మ గౌరవంగా తీసుకువచ్చి మంత్రికి అందజేయగా, ఆ పుస్తకాన్ని ఆవిష్కరించి తదుపరి ఎస్పీ ద్వారా ఇంచార్జ్ అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎస్ డి వి ప్రసాద్ కి అందజేశారు. అడిషనల్ ఎస్పీ దేశ వ్యాప్తంగా విధినిర్వాహణలో అమరులైన పోలీసు సిబ్బంది పేర్లను చదివి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అందులో కృష్ణా జిల్లా పోలీసు శాఖలో అమరులైన సిబ్బంది ఉన్నారు. ఈ సందర్భంగా కృష్ణాజిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు మాట్లాడుతూ భారత్ చైనా సరిహద్దులోని లడక్ ప్రాంతంలో గల హాట్ స్ప్రింగ్ అనే ప్రదేశంలో 1959 అక్టోబర్ 21వ తేదీన సియాచిన్ భూభాగాన్ని ఆక్రమించేందుకు చైనా ముష్కరులు ఆకస్మికంగా దాడి చేసిన సంఘటనలో 10 మంది సిఆర్పిఎఫ్ జవానులు చివరి రక్తపు బొట్టు వరకు పోరాడి తమ ప్రాణాలను అర్పించారు. నాటి నుండి వారి త్యాగాలకు గుర్తుగా అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకోవడం జరుగుతుంది అని అన్నారు. అసాంఘిక శక్తులతో పోరాడుతూ సమ సమాజ నిర్మాణానికి అహర్నిశలు పాటుపడుతూ ఎంతోమంది పోలీస్ వారు అమరులవుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మరణించిన పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ అమరవీరుల సంస్మరణ పరేడ్ ను నిర్వహించడం జరిగింది అని అన్నారు. పోలీసు విధినిర్వహణలో ఎంతో ప్రమాదం త్యాగం నిండి ఉంటుందని, ఇటువంటి కఠినమైన పరిస్థితులలో విధులు నిర్వహిస్తున్న పోలీసువారి యొక్క సంక్షేమం కొరకు రాష్ట్ర పోలీసు శాఖ రాష్ట్ర డిజిపి అధ్వర్యంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. వారి యొక్క త్యాగానికి స్పూర్తిదాయకంగా వారి త్యాగాలను స్మరించుకోవడం గర్వించదగిన అంశం. భౌతికంగా మన మధ్య వారు లేకున్నా మన హృదయంలో చిరస్మరణీయులుగా ఉంటారు. సరిహద్దులను కాపాడేది సైనికులు అయితే, సమాజంలో అంతర్గత శాంతి భద్రతలను పరిరక్షిస్తూ విధులు నిర్వర్తించే పోలీసుల యొక్క విధి నిర్వహణ క్లిష్ట తరం,కత్తి మీద సాముగా తయారయింది అన్నారుసమాజంలో శాంతియుత సమాజ స్థాపన కోసం అంతర్గతంగా విధుల్లో నిమగ్నమై విధి నిర్వహణలో ప్రాణాలను కోల్పోయిన పోలీస్ సిబ్బంది యొక్క కుటుంబాలకు కృష్ణాజిల్లా పోలీస్ శాఖ ఎల్లవేళలా అండగా ఉంటూ, వారికి ప్రభుత్వం తరఫున రావాల్సిన ప్రయోజనాలను సకాలంలో అందేలా చూడటంలో కృషి చేస్తామని తెలిపారు. మరొకసారి పోలీస్ శాఖ కోసం వారి ప్రాణాలను అర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ నివాళులర్పించారు. ఈ కార్యక్రమం సందర్భంగా పోలీస్ సంక్షేమ నిధికి 50,000/- వేల రూపాయలను అందజేసిన రాష్ట్ర మంత్రివర్యులు గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ కార్యక్రమం ఇంత విజయవంతంగా నిర్వహించబడడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు అని ఎస్పీ తెలిపారు. తదుపరి పోలీస్ అమరవీరుల స్తూపం వద్ద అమరవీరులను స్మరించుకుంటూ పూలదండలతో ఘనంగా నివాళులర్పించారు. తదుపరి మంత్రి, ఎస్పీ, పోలీస్ అధికారులతో కలిసి పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులను పలకరించి వారికి అండగా ఉన్నామని భరోసా కల్పించారు. అలాగే ఈ సంవత్సరం వివిధ అనారోగ్య కారణాలతో మరణించిన సిబ్బంది కుటుంబ సభ్యులకు చిరు జ్ఞాపికలను బహుకరించి మీకు అండగా పోలీస్ శాఖ ఉందని భరోసా నింపారు. అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ వారి ప్రాణత్యాగాలను ప్రజలకు తెలిసేలా జిల్లా పోలీస్ పెరేడ్ మైదానం నుంచి జిల్లా కోర్టు సెంటర్ వరకు నిర్వహించిన శాంతి ర్యాలిని మంత్రిగారు, జిల్లా ఎస్పీ గారు , ప్రజా ప్రతినిధులు పోలీసు అధికారులతో కలసి జండా ఊపి ప్రారంభించారు. సిబ్బంది అంతా ఎంతో ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొని ప్రజలకు అమరవీరుల త్యాగాల గూర్చి తెలిసేలా అమరవీరులకు జోహార్లు అర్పిస్తూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.



## అక్రమ కట్టడాలకు అడ్డాగా పడమటిపాలెం

**అనుమతులు శూన్యం.పట్టించుకోని అధికారులు.**



**కలిదిండి అక్టోబర్ 21(వార్తా ప్రభ)** ఏలూరు జిల్లా, కైకలూరు నియోజకవర్గం,కలిదిండి మండలంలో పలుచోట్ల అక్రమ కట్టడాలు పుట్టగొడుగుల్లా వెలిసినాయి. నిబంధనలు పాటించకుండా ఇష్టా రాజ్యంగా అక్రమ కట్టడాలు, కడుతున్నారు. ప్రతినిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారిని ఆనుకొని కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం. కలిదిండి మండలం పడమటిపాలెం గ్రామ పంచాయతీలోని ఆర్ అండ్ బి రహదారి ప్రక్కన అక్రమ భవనం నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అక్రమార్కులు పంచాయతీ అప్రూవల్, ముడా అనుమతులు ఏమీ లేకుండా భారీభవంతు నిర్మాణంపై చర్యలు తీసుకోరా అని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ నిర్మాణం పనులు ఆగటం లేదని పలువురు విమర్శిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి గాని ఉన్నతాధికారులు గాని అక్రమ నిర్మాణం ఆపకపోవడంపై పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి.. ప్రభుత్వ ఆదాయానికి భారీగానే గండి పడుతుంది. రహదారి పక్కన వాణిజ్య సముదాయం నిర్మితమవుతుంది. యదేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘన జరుగుతున్న అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవటం క్షేత్రస్థాయిలో పరిశీలించకపోవడం వల్ల ఇలాంటి నిర్మాణాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ అక్రమ కట్టడాల నిర్మాణాలకు పంచాయతీ అధికారులు నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటారా... లేక చేతులు దులుపుకుంటారో వేచి చూడాలి.

## స్కేటింగ్ పోటీల్లో తాడిపత్రి చిన్నారుల ప్రతిభ




**అనంతపురం అక్టోబర్ 21 :(వార్తా ప్రభ ప్రతి నిధి)** అనంతపురం జిల్లా 68వ రాష్ట్ర స్థాయి ఎస్ జి ఎఫ్ స్కేటింగ్ పోటీల్లో తాడిపత్రి చిన్నారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. కాకినాడలో జరిగిన స్కేటింగ్ పోటీల్లో విద్యార్థులు ముక్తేశ్వరి, ఉజ్వల్, కేశవ నాయుడు, షర్మిల, కార్తీక్ పాల్గొన్నారు. ముక్తేశ్వరికి బ్రాంజ్ మెడల్ వచ్చినట్లు కోచ్ శివ తెలిపారు. అనంతరం చిన్నారులను తాడిపత్రి పట్టణవాసులు

## సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసిన రాష్ట్ర వడ్డీ సాధికారిక కన్వీనర్ బలే యేసురాజు.

**కొట్టాడ గ్రామంలోపల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో పాల్గొన్న కూటమి నాయకులు.**



**కైకలూరు అక్టోబర్ 21 (వార్తా ప్రభ)**ఈరోజు ఏలూరు జిల్లా, కైకలూరు నియోజకవర్గ, కైకలూరు మండలం, కొట్టాడ పంచాయతీ రాజుల కొట్టాడ గ్రామంలో పల్లె పండగ పంచాయితీ వారోత్సవాలు కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆదేశాలు మేరకు రాష్ట్ర వడ్డీ సాధికారక కన్వీనర్ బలే ఏసు రాజు కైకలూరు మండల పార్టీ అధ్యక్షుడు పెనుమత్స తిరుమల రాజు రాజులు కొట్టాడా గ్రామంలో 200 మీటర్ల సిసి రోడ్డుకు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ కొల్లాటి శ్రీను, టిడిపి నాయకులు మాజీ సర్పంచ్ మైల నరసింహారావు, పోనమండ పెంటయ్య, గ్రామ సెక్రెటరీ గ్రామ వీఆర్ఓ ఆ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ ,గ్రామ పెద్దలు, గ్రామస్తులు,కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అబ్దుల్ కలాం ప్రతిభ పురస్కారం అందుకున్న జయ కిషోర్ బాబు.



**కైకలూరు అక్టోబర్ 21 (వార్తా ప్రభ)** , డాక్టర్ ఏ పి జె అబ్దుల్ కలాం ప్రతిభ పురస్కారం అందుకున్న జాగృతి స్కూల్ ప్రిన్సిపాల్ పానేం జయ కిషోర్ బాబు.. పిల్లలు బంగారు భవిష్యత్తును నిర్దేశించే శక్తి ఉపాధ్యాయులకే ఉంటుందని అందుకే వారిని దైవ స్వరూపులుగా భావిస్తూ విద్యారంగానికి ఎనలేని కృషి చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలు కళాశాలల విశ్వ విద్యాలయాలకు యాజమాన్యాలకు.. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ పురస్కారాన్ని జాగృతి పాఠశాల ప్రిన్సిపాల్ పానేం జయ కిషోర్ బాబు అందుకోవటం గర్వించదగ్గ విషయమని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. గుంటూరులోని ఆంధ్ర క్రైస్తవ కళాశాల వేదికలో సదరన్ ప్రవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈ ప్రతిభ పురస్కారాన్ని అందజేశారు. ముఖ్య అతిథిగా కేఎస్ లక్ష్మణరావు విద్యారంగ అభివృద్ధిలో కృషి చేస్తున్న కిషోర్ బాబుకి ఈ పురస్కారాన్ని అందజేశారు. కిషోర్ బాబు కి పాఠశాల ఉపాధ్యాయ మిత్ర బృందం అభినందనలు తెలియజేశారు. అంతేకాకుండా లెక్చరర్స్ టీచర్స్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని లక్ష్మణరావు కోరారు.

## పచ్చదనము ప్రాముఖ్యము



లేకుంటే పచ్చదనము
అగునోయ్! ఎడారి ప్రాంతము
కోల్పోవును భువి అందము
శూన్యమగును ఆహ్లాదము
పచ్చికబయళ్లు మాయము
క్షీణించును ఆరోగ్యము
ఏది!!శోభాయమానము
ఉండదు నయనానందము
పచ్చదనము ఉంటేనే
క్రొత్తదనము కన్పించును
పుడమి తల్లి వదనంలో
సంతసమే వికసించును
పెంచుదాం! పచ్చదనము
పంచుదాం! ఆనందము
మొక్కలెన్నొ నాటి మనము
చూపిద్దాం! బృందావనము

**-గద్వాల సోమన్న,**
9966414580

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన నరేంద్ర యాదవ్ కు50,000 ఆర్థిక సాయం చేసిన వినోద్ కుమార్ యాదవ్




**తిరుపతి : అక్టోబర్ 21 (వార్తాప్రభ ప్రతినిధి)** చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 12వ వార్డులోని నరిగపల్లె గ్రామంలో నివసిస్తున్న నరేంద్ర యాదవ్ అక్టోబర్ 15వ తేదీన ప్రమాదవశాత్తు తన ఎడమ కాలుని పూర్తిగా కోల్పోయారు. తీవ్ర గాయాలైన నరేంద్ర యాదవ్ వేలూరు క్రిస్టియన్ మెడికల్ కాలేజ్ నందు చికిత్స తీసుకుంటూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో యువనాయకుడు హబూలుస్ గ్రూప్ ఫౌండేషన్ చైర్మన్ వినోద్ కుమార్ యాదవ్ అడిగిన వెంటనే స్పందించి నరేంద్ర యాదవ్ కు వైద్య ఖర్చులకు గాను 50వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ఈ మొత్తాన్ని నేరుగా క్రిస్టియన్ మెడికల్ కాలేజ్ కు పంపించినట్లు చిత్తూరు జిల్లా అఖిల భారతీయ యాదవ మహాసభ ప్రధాన కార్యదర్శి నవీన్ యాదవ్ తెలిపారు. ఆర్థిక సాయం చేసిన వినోద్ కుమార్ యాదవ్ ను నవీన్ యాదవ్ కలిసి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

## పోలీసు అమరవీరులకు ఘనంగా అశ్రునివాళులు



**కలువాయి అక్టోబర్ 21 (వార్తాప్రభ)** పోలీసులు అమరవీరుల దినోత్సవం సందర్భంగా సోమవారం కలువాయి పోలీసులు ఘన నివాళులు అర్పించారు. విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా 29-06-2008 న బలిమెల వద్ద జరిగిన మావోఇస్టుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ కీ శే అనకర్ల కేశవులుదేశానికి చేసిన సేవలు నిలిచిపోతాయని రాపూరు సిఐ విజయ్ కృష్ణ తెలిపారు. మండల కేంద్రంలోని పోలీసులు అమర వీరుల స్థూపం వద్ద నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా తమ ప్రాణాలను సైతం త్యాగం చేసి ఎంతోమంది పోలీసులు తమ విధి నిర్వహణలలో అమరులైనారని తెలిపారు. విధి నిర్వహణలలో దేశంకోసం వారి సేవలు ఎనలేనివని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనకర్ల కేశవులు స్థూపం నుండి అతని సమాధి వరకు అన్ని స్కూల్స్ కాలేజి ల విద్యార్థులు తో ర్యాలి నిర్వహించి నివాళ్ళు అర్పించారు. అదే విధంగా అనకర్ల కేశవులు తల్లిదండ్రులు వృద్దులకు పండ్లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో రాపూరు సిఐ విజయ కృష్ణ కలువాయి మండల ఎస్ఐ సుమన్ మండల ద్వితీయ విద్యాశాఖ అధికారి శేషగిరిరావు జెడ్పిపి హైస్కూల్ హెడ్ మాస్టర్ అబ్బాస్ ఆలి డాక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



## సిబ్బంది పనితీరు మెరుగు పరచుకోవాలి- డీఎస్పీ

**తాడిపత్రి అక్టోబర్ 21 (వార్తా ప్రభ)** ,పెద్దవడుగూరు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ను తాడిపత్రి డీఎస్పీ రామకృష్ణయ్య సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, కేసుల పురోగతి గురించి పోలీస్ సిబ్బందిని ఆరా తీశారు. పలు రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరును మెరుగు పరుచుకోవాలని సూచించారు. మండల కేంద్రంలో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచించారు.

# యాదవ ప్రముఖుల మధ్య వైభవోపేతంగా "యాదాద్రి యాదవ భవన్" భూమి పూజ



**యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 21 (వార్తాప్రభ ప్రతినిధి)**యాదాద్రి భువనగిరి జిల్లా లోని యాదాద్రి "శ్రీశ్రీశ్రీ లక్ష్మి నరసింహ" స్వామి వారి ఆలయ సమీపంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య యాదవ్, మాజీ పార్లమెంట్ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్ మరియు ట్రస్టు మెంబర్స్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించబోయే "యాదవ్ భవన్" భూమి పూజ కార్యక్రమానికి తెలంగాణ యాదవ ప్రముఖులు హాజరయ్యారు.



అనంతరం భూమి పూజలో పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "యాదవ భవన్" నిర్మాణానికి భూమి పూజ చేసుకోవడం చాలా అదృష్టంగా భావిస్తున్నామని, బీసీ.ల ఐక్యతను చాటిచెప్పే సంకేతానికి నిదర్శనంగా భవనం సూచిస్తుందని, యాదాద్రి లక్ష్మి నరసింహస్వామి వారి సన్నిధిలో యాదవ భవనాన్ని నిర్మించుకోవడం అదృష్టంగా భావిస్తున్నామని, లక్ష్మి నరసింహ



స్వామి వారి ఆశీస్సులు ఎల్లపుడు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లుగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మణ్ యాదవ్, శేరిలింగంపల్లి రాగం నాగేందర్ యాదవ్, పటాన్ చెరువు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, బొంతు శ్రీదేవి, రాజు యాదవ్ , నరేందర్ యాదవ్ , యాదాద్రి యాదవ్ భవన్ ట్రస్ట్ ఛైర్మెన్ బద్దుల బాబు రావు యాదవ్ , ట్రస్ట్ సభ్యులు బత్తుల ప్రకాష్ యాదవ్ , సిపిరి యాదయ్య యాదవ్, ఎన్ వెను గోపాల్ యాదవ్, జై కిషన్ యాదవ్,చింతల రవీందర్ నాథ్ యాదవ్, బాల మల్లేష్ యాదవ్ , యాదవ సంఘం జంబాగ్ నాయకులునంద కిషోర్ యాదవ్ ,ఉష్కల కిషన్ యాదవ్ , బోయిన వెంకటేశ్ యాదవ్ మరియు అందెల రాములు యాదవ్, దారబోయిన శ్రీనివాస్ యాదవ్, యేషాం మనీష్ యాదవ్, పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, నర్సింగ్ యాదవ్ , గోపు బాలరాజు యాదవ్, గడ్డం చంద్ర శేఖర్ యాదవ్, జంగయ్య యాదవ్, గంగల నరసింహ యాదవ్, చింతల కిరణ్ కుమార్ యాదవ్, బోయిని మహేందర్ యాదవ్, దోతీ శంకరయ్య యాదవ్, నదికుడి రఘునాథ్ యాదవ్, సలంద్రి మహేందర్ యాదవ్, పాక వెంకటేష్ యాదవ్, మన్నెబోయిన గోపాల్ యాదవ్, పోచబోయిన శ్రీహరి యాదవ్ అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్ గొర్ల యశ్వంత్ రాజ్ యాదవ్ , ఉపాధ్యక్షులు అవులగడ్డ మక్కర్ యాదవ్, యటం పవన్ యాదవ్, మనోహర్ యాదవ్, మారం తిరుపతి యాదవ్, విజయ్ యాదవ్, లక్ష్మిపతి యాదవ్, సతీష్ యాదవ్, సందవేని మహేందర్ యాదవ్ , రాజబోయిన సంతోష్ యాదవ్ , రాజేష్ యాదవ్, ట్రస్టు మెంబర్లు మరియు యాదవ సోదర-సోదరమణిలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దాలి

**● ఈ డబ్ల్యూస్ రిజర్వేషన్లతో బీసీలకు తీరని అన్యాయం ● జీవో నెంబర్ 29 నీ తక్షణమే రద్దు చేయాలి ● రాష్ట్ర గవర్నర్ జీష్ణు దేవు వర్మ తో బీసీ సంఘాల భేటీ**



**హైదరాబాద్ అక్టోబర్ 21 (వార్తాప్రభ ప్రతినిధి)**తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేయడం మూలంగా బీసీలకు తీరని అన్యాయం జరుగుతుందని అలాగే ఇటీవల గ్రూప్ వన్ నోటిఫికేషన్ లో జీవో నెంబర్ 29 ద్వారా ఉద్యోగాలు భర్తీ చేయాలని ప్రభుత్వ విధానం బీసీలకు తీవ్రని నష్టం చేకూరుస్తుందని బిసి మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ రిటైర్డ్ ఐఎఎస్ అధికారి టి చిరంజీవులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారుబీసీలకు తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్ది ఉద్యోగాల నియామకాలలో బీసీలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈరోజు బీసీ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో 20 బీసీ సంఘాల ప్రతినిధుల బృందం రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మ తో రాజభవన్ లో భేటీ అయ్యారు ఈ సందర్భంగా గవర్నర్ గారికి బీసీ ప్రతినిధుల బృందం బీసీ డిమాండ్లతో కూడిన విజ్ఞాపన పత్రాన్ని గవర్నర్ కు అందజేశారుజనాభా లెక్కలు లేకుండా ఎలాంటి శాస్త్రీయత లేకుండా ఉద్యోగాల నియామకాలలో అగ్రవర్ణాల పేదల పేరుతో ఎడబ్ల్యూస్ రిజర్వేషన్లు 10 శాతం అమలు చేయడం మూలంగా బీసీలకు చాలా అన్యాయం జరుగుతుందని అలాగే ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్ వన్ ఉద్యోగాల నియామకాల కోసం విడుదల చేసిన జీవో నెంబర్ 29 వల్ల బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థులకు అన్యాయం చేసే విధంగా ఉందని ఈ విషయంలో రాష్ట్ర గవర్నర్గా జోక్యం చేసుకొని బీసీలకు న్యాయం జరిగేలా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని వారు గవర్నర్కు విజ్ఞప్తి చేశారుఅనంతరం రాజభవన్ బయట జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు జీవో నెంబర్ 29 బీసీ వర్గాలకు ఉరితాడుగా మారిందని ఎక్కువ మార్కులు వచ్చిన బీసీలకు ఉద్యోగాలు రావడం లేదని అతి తక్కువ మార్కులు వచ్చిన అగ్రవర్ణాలకు మాత్రం ఉద్యోగాలు వస్తున్నాడం చాలా బాధాకరమన్నారు మొన్న జరిగిన డీఎస్సీ పరీక్షల ఫలితాల్లో బీసీ ఎస్సీ ఎస్టీ అభ్యర్థుల కంటే కటప్ మార్కుల తక్కువ వచ్చిన వారికి ఉద్యోగాలు ఎలా ఇస్తారని వారు ప్రశ్నించారుగ్రూప్ వన్ విషయంలో గతంలో ఉన్న 55 జీవోను సవరించి 29 ని తీసుకురావడంలో ప్రభుత్వం యొక్క అంతర్యం ఏమిటని వారు ప్రశ్నించారు ఓపెన్ లో వచ్చిన రిజర్వేషన్ అభ్యర్థులను రిజర్వేషన్ కేటగిరీ కింద లెక్కిస్తూ గ్రూపు వన్ ఉద్యోగాలలో బీసీ ఎస్సీ ఎస్టీలకు ఉద్యోగాలు రాకుండా కుట్ర చేయడానికి ఈ జీవో నెంబర్ 29 ని తీసుకొచ్చారని వారు మండిపడ్డారు ఎవరిని సంప్రదించకుండా ఉద్యమాలు చేస్తున్న విద్యార్థులను చర్చలు జరపకుండా రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్-1 మెయిన్ పరీక్షలు నిర్వహించడం ఎంతవరకు సమంజసంమన్నారు ఈరోజు గ్రూప్ ఫోన్లో అగ్రకుల అభ్యర్థులు ఉద్యోగాలకు సెలెక్ట్ కాబడితే భవిష్యత్తులో కంఫర్ట్ ఐఏఎస్లుగా ఐపీఎస్లుగా అతి తక్కువ జనాభా ఉన్న అగ్రకులాలదే ఉద్యోగాలు దక్కుతాయని వారు ఆందోళన వ్యక్తం చేశారుఈ డబ్ల్యూ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం తమిళనాడు చత్తీస్గడ్ రాష్ట్రాల్లో మాదిరిగా సమీక్ష జరపి బీసీలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అలాగే జీవో నెంబర్ 29ని రద్దుచేసి రిజర్వేషన్ వర్గాలకు న్యాయం జరిగేలా వేరొక జీవోను తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని టి చిరంజీవి, జాజుల శ్రీనివాస్ గౌడ్, తీన్మార్ మల్లన్న హెచ్చరించారు ఎంఎమ్స్ ఎమ్ ఇ పాలసీలో కూడా బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని గవర్నర్ ను కోరారు గవర్నర్ కలిసిన ప్రతి బృందంలో చెరుకు సుధాకర్,పల్లె రవికుమార్, కుందారం గణేష్ చారి, బాలగోని బాలరాజు గౌడ్,బత్తిని సిద్దేశ్వర, సంగం సూర్యారావు, చామకూర రాజు, బత్తిని లత, బంగారు నరసింహ సాగర్, కె.వి గౌడ్,ఎర్ర మాదా వెంకన్న నేత,ఒంటెద్దు నరేందర్ తదితరులు పాల్గొన్నారు

## రుషికొండ నిర్మాణాలు పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



**విశాఖపట్నం అక్టోబర్ 21 (వార్తాప్రభ ప్రతినిధి)**గుర్ల పర్యటన ముగించుకొని తిరుగు ప్రయాణంలో విశాఖపట్నం విమానాశ్రయానికి వస్తూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రుషికొండపై గత ప్రభుత్వం రాజ భవంతుల తరహాలో చేసిన నిర్మాణాలను పరిశీలించారు. గత ప్రభుత్వంలో సుమారు రూ.600 కోట్లను ఖర్చు చేసి మరీ నిర్మించిన ఈ భవనాలు ఎన్నికల ముందు ఎవరూ చూడటానికి కూడా అప్పటి ప్రభుత్వం అనుమతించలేదు. ఎన్నికల ముందు విశాఖపట్నం పర్యటనలో పలుమార్లు పవన్ కళ్యాణ్ రుషికొండ ప్యాలెస్ గురించి ప్రస్తావించారు. అటుగా వస్తున్న ఉప ముఖ్యమంత్రివర్యులు ప్యాలెస్ ను ఒకసారి పరిశీలించాలని భావించి లోపలకు వెళ్లారు. 7 అతి పెద్ద భవనాలు, వీటిలోని మూడు ఇళ్లను నిర్మించిన తీరును ఎంపీ ఎం.భరత్ ఉప ముఖ్యమంత్రికి వివరించారు. ప్యాలెస్ పరిసరాలను, సీ వ్యూ పాయింట్ ను బయట నుంచే చూసిన పవన్ కళ్యాణ్ అక్కడ పని చేస్తున్న సిబ్బందితో మాట్లాడి, వారితో ఫొటోలు దిగారు. భవనాల ఎత్తు, వాటి విస్తీర్ణం,వాటి మార్కెట్ ధర వంటి విషయాలను, అలాగే న్యాయ పరమైన అంశాలను పవన్ కళ్యాణ్ కి యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ , విశాఖ కార్పొరేటర్ పి.మూర్తి యాదవ్ వివరించారు. సుమారు 30 నిమిషాల పాటు రుషికొండ ప్యాలెస్ పరిసరాలను పరిశీలించిన అనంతరం అక్కడి నుంచి విమానాశ్రయానికి బయలుదేరారు.

# డ్రోన్ షో తిలకించడానికి విజయవాడలో ఐదు చోట్ల భారీ తెరలు

**● అమరావతి డ్రోన్ సమ్మిట్కు విస్తృత ఏర్పాట్లు ● ఏర్పాట్లలో నిమగ్నమైన 300 మంది సిబ్బంది అధికారులు ● 10 మంది డిప్యూటీ కలెక్టర్లకు ప్రత్యేక బాధ్యతలు ● ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్న డ్రోన్ కార్పొరేషన్ ఎండీ కె. దినేష్ కుమార్**

**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అమరావతి డ్రోన్ సమ్మిట్-2024 కు సంబంధించి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. పున్నమీ ఘాట్ వద్ద 22వ తేదీ సాయంత్రం 5 వేలకు పైగా డ్రోన్లతో మెగా షో నిర్వహిస్తున్నారు. ఈ డ్రోన్ షోని ప్రజలందరూ విస్తృతంగా తిలకించడానికి వీలుగా విజయవాడ నగరంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. నగరంలో ఐదు ప్రాంతాల్లో భారీ డిజిటల్ తెరలు ఏర్పాటు చేసి ప్రజలు ఈ షోని తిలకించి ఆస్వాదించేలా ఏర్పాట్లు చేశామని డ్రోన్ కార్పొరేషన్ ఎండీ కె. దినేష్ కుమార్ చెప్పారు. విజయవాడ నగరంలో బెంజిసర్కిల్, రామవరప్పాడు రింగు, కనకదుర్గమ్మ వారధి, బస్టాండు, ప్రకాశం బ్యారేజీల వద్ద ఈ డిజిటల్ తెరలు ఏర్పాటు చేసి ఈ డ్రోన్ షోని ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నామని చెప్పారు. ప్రజలందరూ ఈ షోని తిలకించాలని, పున్నమీ ఘాట్లో కూడా ప్రజలు ఈ షోని ప్రత్యక్షంగా తిలకించవ్చని తెలిపారు.

**ఏర్పాట్లలో నిమగ్నమైన యంత్రాంగం** 22-23వ తేదీల్లో నిర్వహించే అమరావతి డ్రోన్ సమ్మిట్ విజయవంతం చేయడానికి అధికార యంత్రాంగం రేయింబవళ్లు కృషి చేస్తోంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, రాష్ట్ర పెట్టుబుడులు, మౌలికసదుపాయాల శాఖ కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్, ఏపీ డ్రోన్ కార్పొరేష్ ఎండీ కె. దినేష్ కుమార్లు ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. మంగళగిరి సీకే కన్వెన్షన్ లో 22వ తేదీ ఉదయం అమరావతి డ్రోన్ సమ్మిట్ ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభిస్తారు. ఈ సదస్సుకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహననాయుడు, ఐటీ శాఖ మాత్యులు నారా లోకేష్, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పన శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డిలు కూడా పాల్గొంటారు. అదే రోజు సాయంత్రం పున్నమీ ఘాట్లో పెద్ద ఎత్తున డ్రోన్ షో, క్రాకర్ షో, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ ఏర్పాట్లను చేయడంలో అధికార యంత్రంగా తలమునకలైంది. 10 మంది డిప్యూటీ కలెక్టర్లకు ఈ ఏర్పాట్లకు సంబంధించి ప్రత్యేక బాధ్యతలు అప్పజెప్పారు. దాదాపు 300 మంది అధికారులు, సిబ్బంది రేయింబవల్లు శ్రమించి ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రజలందరూ ఈ డ్రోన్ షోను తిలకించి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలిన ఏపీ డ్రోరన్ కార్పొరేషన్ ఎండీ కె. దినేష్ కుమార్ కోరారు.

# నా చూపు, నా అడుగులు, నా ఆలోచనలు నియోజకవర్గ అభివృద్ధి వైపు

**తప్పు చేసి ఉంటే టవర్ క్లాక్ వద్ద నిలదీయండి - ఎమ్మెల్యే పులివర్తి నాని**




**చంద్రగిరి : అక్టోబర్ 21 (వార్తాప్రభ ప్రతినిధి)** తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే కొండంత బలమని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. పార్టీ అధినాయకత్వం ఆదేశాల మేరకు పార్టీ సభ్యత్వ నమోదు కోసం చంద్రగిరి పట్టణంలోని ఎం ఎస్ ఆర్ కళ్యాణ మండపంలో సోమవారం 6 మండలాల నియోజకవర్గస్థాయి నాయకులు, మండల నాయకులు, జనరల్ సెక్రటరీలు, బూత్ ఇన్చార్జిలు, క్లస్టర్ ఇన్చార్జిలు, యూనిట్ ఇన్చార్జిలు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పులివర్తి నాని ముఖ్యఅతిథిగా విచ్చేశారు. జ్యోతి ప్రజ్వలన చేసి, ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ముందుగా పోలీసుల అమరవీరుల దినోత్సవంను పురస్కరించుకుని విధి నిర్వహణలో ప్రాణాలు విడిచిన పోలీసులకు మూడు నిమిషాల పాటు మౌనం పాటించి సంతాపం తెలిపారు. అనంతరం ఎంయల్ఏ నాని మాట్లాడుతూ గెలిచిన తర్వాత నియోజకవర్గ నాయకులతో 2వ సారి మీటింగ్ పెట్టడం జరిగిందని అన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు రుసుము 100 రూపాయలు మాత్రమే నని తెలిపారు. సభ్యత్వం తీసుకున్న వారి సంక్షేమం కోసం పార్టీ ఎన్నో కార్యక్రమాలను చేపడుతుందని చెప్పారు. ఏదైనా ప్రమాదవశాత్తు కార్యకర్త మృతి చెంది నప్పుడు మట్టి ఖర్చులకు 10 వేల రూపాయలు ఇస్తుందని, పార్టీ సభ్యత్వం ఉన్న వ్యక్తికి గతంలో 2లక్షలు రూపాయలకు మారుగా 5 లక్షలు రూపాయలకు ఆర్థిక చేయూతను పెంచి ఇవ్వటానికి నిర్ణయించిందన్నరు. పెద్దాయన ముఖ్యమంత్రి టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు 2015 నుండి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల పార్టీ అధ్యక్షులు నాగరాజు నాయుడు,, ఈశ్వర్ రెడ్డి ,సుబ్రహ్మణ్యం నాయుడు ,మధు , నాయకులు గౌస్ బాషా, రమేష్ రెడ్డి, శివ కోటిరెడ్డి, సురేష్ రెడ్డి ,బడి సుధా యాదవ్ ,సకూరు ధనంజయ రెడ్డి సుధా, కడియాల రవితేజ యాదవ్, మండలం లోకేష్, చెరుకూరి లీలా కృష్ణ , క్లస్టర్, యూనిట్ ఇంచార్జ్ లు, మహిళలు, యువత, పార్టీ శ్రేణులు, అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వసూళ్లలో వివాదం- హిజ్రాల మధ్య ఘర్షణ



- పోలీస్ స్టేషన్ కు చేరిన రెండు గ్రూపుల పంచాయితీ పోలీసుల హెచ్చరిక

**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 21 (వార్తా ప్రభ ప్రతినిధి):-** నగదు వసూళ్లలో హిజ్రాల మధ్య తలెత్తిన వివాదం సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ కు చేరింది. విజయవాడ, ఇబ్రహీంపట్నం గ్రూపులకు చెందిన సుమారు 100 మంది హిజ్రాలు పోలీస్ స్టేషన్ లో వాగ్వాదానికి దిగారు. కొద్దిసేపు పోలీస్ స్టేషన్ లో హిజ్రాల వాగ్వాదంతో గందరగోళం, ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పోలీసులు వీరిని అదుపు చేయడం కష్టమైంది. ఎట్టకేలకు రెండు గ్రూపులకు సర్ది చెప్పి విజయవాడ గ్రూపును బయటకు పంపేశారు. అయితే ఆ గ్రూపు హిజ్రాలు గంటకు పైగా పోలీస్ స్టేషన్ బయటే కూర్చున్నారు. ఇబ్రహీంపట్నం గ్రూపు హిజ్రాలు పోలీస్ స్టేషన్ లోనే ఉన్నారు. అయితే రెండు గ్రూపుల హిజ్రాలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు.

**నగదు వసూళ్లలో హిజ్రాల మధ్య తగాదాలు**కొండపల్లి పట్టణంలో సోమవారం ఒక వ్యాపార సముదాయం ప్రారంభాన్ని పురస్కరించుకుని ఇబ్రహీంపట్నం హిజ్రా గ్రూపు ఆ యజమాని నుంచి పెద్ద మొత్తంలో నగదు వసూలు చేసింది. ఆ తర్వాత విజయవాడ హిజ్రా గ్రూపు అదే వ్యాపార సముదాయం వద్దకు వెళ్లి నగదు వసూలుకు ప్రయత్నించింది. దీంతో ఆ యజమాని ఇంతకుముందు ఇచ్చేశామని చెప్పారు. ఎవరికి ఇచ్చారని అడుగగా ఇబ్రహీంపట్నం గ్రూపుకు ఇచ్చామని సమాధానమిచ్చారు. దీంతో విజయవాడ హిజ్రా గ్రూపు ఇబ్రహీంపట్నం హిజ్రా గ్రూపును ఫోన్ లో ఎందుకు వసూలు చేశారని ప్రశ్నించింది. రెండు గ్రూపుల మధ్య మాటామాట పెరిగి వాగ్వాదానికి దారితీసింది. దీంతో విజయవాడ గ్రూపు స్థానికంగా వసూళ్లు చేయడమే కాకుండా దౌర్జన్యం చేస్తుందని ఇబ్రహీంపట్నం గ్రూపు పోలీసులకు ఫిర్యాదు చేసింది. విషయం తెలుసుకున్న విజయవాడ గ్రూపు హిజ్రాలు సుమారు 100 మంది పోలీస్ స్టేషన్ కు చేరుకున్నారు. పోలీసుల సమక్షంలోనే వాగ్వాదానికి దిగారు. ఇబ్రహీంపట్నం హిజ్రా గ్రూపు యూనియన్ లో సభ్యులుగా చేరకుండా ఇష్టమొచ్చినట్లు అధిక మొత్తంలో వసూలు చేస్తుందని, ఇటీవల నగరంలో ఇలాగే వసూలు చేసిందని వీరి వల్ల తమకు చెడ్డపేరు వస్తుందని విజయవాడ గ్రూపు హిజ్రాలు అంటున్నారు. దీనిపై ప్రశ్నిస్తే సభ్యులుగా చేరమని, ఇలాగే వసూలు చేస్తామని నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని ఆరోపించారు. చివరికి మరోసారి ఒక గ్రూపులో మరో గ్రూపు జోక్యం చేసుకోకుండా ఎవరి పని వారు చేసుకుంటామని ఎలాంటి గొడవలు, ఘర్షణలకు దిగమని చెప్పి వెళ్లిపోయారు.

**దౌర్జన్యంగా వసూళ్లు చేస్తే సహించేది లేదు** హిజ్రాలు దౌర్జన్యంగా వసూళ్లు చేస్తే సహించేది లేదు. వ్యాపారులు, ప్రజలకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తిస్తే తిరగనివ్వం. నగదు వసూళ్లలో గొడవలు, వాగ్వాదాలకు దిగకుండా ఉంటే మంచిది. గొడవలు, ఘర్షణలకు దిగితే కఠినంగా వ్యవహరిస్తాం.

ఎ.చంద్రశేఖర్, ఇబ్రహీంపట్నం సీఐ

# అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలకు ఉపక్రమించిన మున్సిపల్ అధికారులు

**ఏళ్ల తరబడి పాతుకుపోయిన ప్రణాళిక విభాగం సిబ్బందికి స్థానచలనం**




**శేరిలింగంపల్లి,అక్టోబర్ 21 (వార్తాప్రభ):**ఏండ్ల తరబడి ఒకే సర్కిల్లో పాతుకుపోయిన పట్టణ ప్రణాళికా విభాగం చైన్మన్లకు స్థాన చలనం కలిగింది. అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలకు ఉపక్రమించిన శేరిలింగంపల్లి జోనల్ అధికారులు ఆ మేరకు క్షేత్రస్థాయిలో దిద్దుబాటు చర్యలను ప్రారంభించారు.ఈ మేరకు శేరిలింగంపల్లి జోన్ వ్యాప్తంగా సర్కిళ్లలో పట్టణ ప్రణాళికా విభాగంలో పని చేస్తున్న చైన్మన్లను బదిలీ చేస్తూ జోనల్ అధికారులు సోమవారం ఆదేశాలు చేసారు.ఆయా సర్కిళ్ల డీసీల నుంచి వచ్చిన చైన్మన్ల పనితీరు నివేదికల ఆధారంగా ఈ బదిలీలను చేసారు. ఇందులో శేరిలింగంపల్లి సర్కిల్లో పని చేస్తున్న చైన్మన్లలో లక్ష్మీనారాయణను యూసుఫ్గూడ సర్కిల్కు , జావీద్ను చందానగర్ సర్కిల్కు బదిలీ చేసారు. చందానగర్ సర్కిల్లో పని చేస్తున్న ఐలయ్యను శేరిలింగంపల్లి సర్కిల్ కి కుమారస్వామిలను పటాన్ చెరు సర్కిల్కు బదిలీ చేసారు. కాగా పటాన్ చెరు సర్కిల్లో పని చేస్తున్న మల్లేష్ను శేరిలింగంపల్లి సర్కిల్కు , రాజేందర్ను చందానగర్ సర్కిల్కు బదిలీ చేసారు. చందానగర్ సర్కిల్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ ప్రవీణ్కుమార్( గడ్డం శ్రీను)ను పటాన్ చెరు సర్కిల్కు బదిలీ చేసారు.వీరందరినీ తక్షణమే రిలీవ్ చేయాలని జోనల్ కమీషనర్ ఉపేందర్రెడ్డి తన ఆదేశాలలో పేర్కొన్నారు.జోన్ వ్యాప్తంగా నాక్ ఇంజనీర్లను సైతం బదిలీ చేసినట్లు జోనల్ కమిషనర్ తెలిపారు...కాగా సోమవారం సాయంత్రం కొందరు చైన్మన్లు తమకే కేటాయించిన కొత్త సర్కిళ్లలో రిపోర్ట్ చేసారు.

# పోలీస్ అమరవీరుల త్యాగం వెలకట్టలేనిది

**క్యాండిల్ ర్యాలీ నిర్వహించిన సర్కిల్ ఇన్స్పెక్టర్ కే. జగదీశ్**

**తొర్రూరు, అక్టోబర్ 21(వార్తా ప్రభ)**పోలీస్ అమరవీరుల త్యాగం వెలకట్టలేనిదని అమరవీరులకు ఘన నివాళి అర్పించిన సర్కిల్



ఇన్స్పెక్టర్ కే.జగదీశ్ సోమవారం అమరవీరుల దినోత్సవం సందర్భంగా తొర్రూరు లోని అన్నారం రోడ్డు సమీపంలో కోవత్తుల ర్యాలీ మొదలుపెట్టి బస్టాండ్ మీదుగా ర్యాలీ నిర్వహించి అమరవీరుల స్థూపం వద్దకు చేరుకొని ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సి ఐ మాట్లాడుతూ ఎందరో త్యాగమూర్తులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా చేసిన త్యాగ ఫలితమే మనం అనుభవిస్తున్నామని అన్నారు.ప్రతి సంవత్సరం వారి త్యాగాలను స్మరించుకుంటూ మరోసారి వారిని గుర్తు చేసుకోవడం గర్వించదగ్గ విషయమని అన్నారు.కనిపించేటువంటి శత్రువులతో పోరాడడానికి వివిధ దళాలు ఉంటాయని కానీ అంతర్గత శత్రువులతో పోరాడి ప్రజలలో శాంతిభద్రతలు కాపాడడం విషయంలో తన ప్రాణాలను తృణప్రాయంగా పెట్టీ విధి నిర్వహణలో ప్రాణాన్ని సైతం విడిచిపెట్టే వారే పోలీసు అని ఏ క్షణానైనా ఈ దేశం కోసం ఈ సమాజం కోసం ఈ ప్రజల కోసం తమ ప్రాణాలను వదులుతామని ఉద్యోగంలో చేరిన రోజే ప్రమాణం చేసి వచ్చేవారే పోలీసులని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు జి ఉపేందర్ రాంజీనాయక్,పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్స్ తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిస్టుల, అమరవీరుల త్యాగాలు మరువలేనివి. ఋసి.పి.ఐ నాయకులు పెద్దు వెంకటరత్నం, వాసుదేవరావు



**గన్నవరం, అక్టోబర్ 21 (వార్తాప్రభ ప్రతినిధి)...** అమరవీరుల త్యాగాలు మరువలేనివి అని నియోజకవర్గ కార్యదర్శి పెద్దు వాసుదేవరావు అన్నారు.సోమవారం తెలంగాణ సాయుధ పోరాటంలో అమరులైన కామ్రేడ్ చింతపల్లి పాపారావు సంస్మరణ దినోత్సవం సందర్భంగా సీపీఐ సీపియం పార్టీల ఆధ్వర్యంలో అమరవీరుల స్థూపాలకు పార్టీ జెండాలు ఎగురవేశారు. బుద్దవరం గ్రామంలో కామ్రేడ్ చింతపల్లి పాపారావు స్థూపం పై మాజీ సిపిఐ కార్యదర్శి ముద్ర బోయిన వెంకటేశ్వరరావు సిపిఐ జెండాను ఎగర వేశారు.దావాజిగూడెం దళిత వాడలో కామ్రేడ్ గొంది వెంకటేశ్వరరావు స్థూపంవద్ద సీనియర్ కామ్రేడ్ శనగల సుబ్బారెడ్డి జెండాను ఎగరవేశారు. అల్లాపురం గ్రామంలో కొలుసు రాఘవులు స్థూపంవద్ద కామ్రేడ్ కట్టెవరపు విజయరావు జెండా ఎగరవేశారు.పామర్తి సుబ్బారావు స్థూపం వద్ద కామ్రేడ్ బండారు లక్ష్మయ్య జెండా ఎగరవేశారు. దావజీగూడెం సిపిఐ పార్టీ కార్యాలయం లో కామ్రేడ్ కాట్రగడ్డ చిన్న వెంకట్రాయుడు స్థూపం వద్ద కామ్రేడ్ కాట్రగడ్డ రామచంద్ర జోషి ఎగరవేశారు. దావాజిగూడెం హై స్కూల్ వద్ద కోసరాజు వెంకటేశ్వరవు స్థూపంపైకామ్రేడ్ వెంకటేశ్వరవు జెండా ఎగరవేశారు.రాజీవ్ కాలనీ లో కంభంపాటి వెంకటరత్నం స్థూపంపై కామ్రేడ్ చాగంటి పాటి వెంకటేశ్వరరావు ఎగరవేశారు. సుబ్బారావు నగర్ లో కామ్రేడ్ కంభంపాటి రాంబ్రహ్మం స్థూపం పై సి.పి.ఐ కార్యదర్శి పెద్దు వాసుదేవరావు జెండా ఎగరవేశారు. గొల్లనపల్లి అమరవీరుల స్థూపంపై యలమదల కోటయ్య బి.బిగూడెం గ్రామం లో కామ్రేడ్ మాచినేని సాంబశివరావు జెండా ఎగర వేశారు.స్థానిక సిపిఐ పార్టీ కార్యాలయంలో సీనియర్ కామ్రేడ్ పెద్ద వెంకటరత్నం సిపిఐ జెండా ఆవిష్కరించారు . ఈ సందర్భంగా సీనియర్ కామ్రేడ్ పెద్దు వెంకటరత్నం మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలను,వారి ఆశయ సాధనకు మనం కృషి చేయాలని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ శ్రమజీవుల కోసం పనిచేస్తుందని తెలిపారు .అనంతరం ఆయన అమర వీరులకు జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సి.పి.ఐ నాయకులు వెంగల శివయ్య,నూతక్కి మోహన్ రావు,కట్టెవరపు బెనర్జీ,వెంగల రంగారావు, శంకర్ రావు చాగంటిపాటి భవాని ప్రసాద్,అశోక్ కుమార్, తాటి శివరామకృష్ణ,కొండా వీరాస్వామి, తిరివీది సుబ్బారావు, సినియర్ విలేకర్ వల్లూరి శ్రావణ్ కుమార్,మద్దినేని శివ, సిపిఎం నాయకులు కళ్ళెం వెంకటేశ్వరరావు. సిపిఎం కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు,మిరప నాగేశ్వరావు, సాంబశివరావు, అవుటుపల్లి సాంబయ్య, సర్దార్ ,మిరఖాన్,షేక్ మాహబూబ్, బాబురావు,తదితరులు పాల్గొన్నారు.

# చంద్రగూడెం సొసైటీ లో భారీ కుంభకోణం

● సుమారు రూ.1.65 కోట్లు గోల్ మాల్ ● ఆడిట్ లో బయట పడ్డ అవినీతి భాగోతం ● సొసైటీ లను కంప్యూటరీకరణ చేయక పోవడమే కారణమా......?

● ఎంక్వైరీ చేపట్టనున్న కె డి సి సి బ్యాంక్ జిల్లా ఉన్నతాధికారులు ● రైతుల పేరట అధిక రుణాలు ● రికార్డులు పరిశీలించిన పి ఐ సి సుజాత





గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(పీఏసీఎస్)కీలక పాత్ర వహిస్తున్నాయి.రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్న పీఏసీఎస్ లు ఏటా ఖరీఫ్,రబీలో స్వల్ప దీర్ఘకాలిక రుణాలను అతి తక్కువ వడ్డీకి అందిస్తూ రైతాంగాన్ని ఆదుకుంటున్నాయి.అయితే చాలాచోట్ల సహకార సంఘాలలో ఆర్థిక లావాదేవీలు సక్రమం గా నిర్వహించడంలేదన్న ఆరోపణలు వస్తున్నాయి.రైతుల పారదర్శకత కోసం 15 ఏళ్ల క్రితమే 'కంప్యూటరీకరణ'కు శ్రీకారం చుట్టినా నేటికీ ఆ ప్రక్రియ పూర్తి కాలేదు.దీంతో సొసైటీ బ్యాంక్ లలో జవాబుదారీతనం లోపిస్తోందన్న వాదన వ్యక్తమవుతోంది.దీంతో సొసైటీ ల్లో పనిచేస్తున్న కొంతమంది ఉద్యోగులు అవినీతికి పాల్పడుతున్నారు.రైతులను నమ్మించి కోట్ల రూపాయలను మింగేస్తు న్నారు.ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా కొన్ని సొసైటీల్లో భారీ కుంభకోణాలు బయట పడ్డాయి.ఇటీవల ఎన్టీఆర్ జిల్లా, మైలవరం మండలంలోని చంద్రగూడెం పీఏసీఎస్ లో అవినీతి బాగోతం బట్టబయలైంది.సుమారు రెండు కోట్ల మేర కుంభకోణం జరిగినట్లు అధికారులకు గణాంకాలు చెబుతున్నాయి. వివరాలలోకెళితే..

**మైలవరం,అక్టోబరు 21 (వార్తాప్రభ) :** మండలంలోని చంద్రగూడెం గ్రామంలో డి.ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పి ఏ సి ఎస్)లో భారీ కుంభకోణం అలస్యంగా బయట పడింది.రైతుల ఫిర్యాదు మేరకు ఏదాది క్రితం జరిగిన ఆడిట్ లో సుమారు రూ.1.65 కోట్లు అవినీతి జరిగిందని లెక్కలు తేల్చారు. సొసైటీలో పనిచేసే గుమస్తా, సెక్రెటరీ లు ఆ సొసైటీ ప్రెసిడెంట్ భాగస్వామ్యంతో ఈ భారీ కుంభకోణా నికి పాల్పడినట్లు స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు.రైతుల కు తెలియకుండానే వారి పేరట దీర్ఘ స్వల్ప కాలిక రుణాలు అధిక మొత్తంలో ఇచ్చినట్టు చిత్రీకరించి సొమ్ము చేసుకు న్నారు.రైతుల నుంచి వసూళ్లు చేసిన బకాయి సొమ్ము ను బ్యాంక్ కు జమ చేయకుండా సెక్రటరీ,గుమస్తా సొంతాని కి వాడుకున్నారు.ఏదాది క్రితమే ఈ అవినీతి భాగోతం బయటపడినా విచారణ పేరుతో బయటకు పొక్కనీయ కుండా జిల్లా సహకార సంఘం అధికారు లు,సొసైటీ సిబ్బంది జాగ్రత్త పడ్డారు. అయితే గ్రామానికి చెందిన రైతు తాతా పోతురాజు తనకు మంజూరు చేసిన రుణానికి సంబంధించి జరిగిన అవక తవకలపై ఫిర్యాదు చేయడంతో విజయవాడ కెడిసిసి బ్యాంక్ పర్సనల్ ఇంచార్జ్ చైర్ పర్సన్ సుజాత సోమవారం సొసైటిని సందర్శించి పోతురాజు ఖాతా కు సంబందించిన రికార్డులను పరిశీలించారు.మరోవైపు 2015 వ సంవత్సరం నుంచి 2018 వరకు ఆర్థిక లావాదేవీలలో తేడాలు కనిపించాయాని మైలవరం కెడి సిసి బ్యాంక్ సూపర్వైజర్ రామకృష్ణ వెల్లడిం చారు.ఆడిట్ లో రూ.1కోటి 4 లక్షలు అవినీతి జరిగిందని వడ్డీ తో కలిపి రూ.1కోటి 66 లక్షలు ఫ్రాడ్ జరిగింద న్నారు.దీనిలో రూ.1కోటి 30లక్షలు వరకు సొసైటీ సెక్రెటరి మరియు గుమస్తా నుంచి రికవరీ చేయడం జరిగిందని, మిగిలిన రూ.36 లక్షలకు సంబందించి వారికి నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. అయితే సొసైటి రసీదు పుస్తకాలు తనిఖీ చేస్తే రూ.3 కోట్లు కు పైగా కుంభకోణం బయటపడే అవకాశం ఉందని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు.

**రసీదు పుస్తకాలు కనిపించకపోవడలో ఆంతర్యం ఏమిటి...?**

సొసైటీలో అర్థాంతరంగా కనిపించ కుండా పోయిన రసీదు పుస్తకాలు లభ్యమైతే తప్పా జరిగిన కుంభకోణం ఎంత అనేది తెలుస్తుందని రైతు లు అంటున్నారు.రసీదు పుస్తకాలు నిజంగా పోయాయా? లేక కావా లనే దాచి పెట్టారా? అనే అనుమానం రైతులు వ్యక్తం చేస్తున్నారు. కుంభకోణం వ్యవహారం ఎక్కడ బయటపడుతుందో నన్నభయంతో ముందుగానే ఒక పథకం ప్రకారం రసీదు పుస్తకాలు పెద్ద మొత్తం లో పోయాయంటూ 5 నెలల క్రితం మైలవరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి పత్రికా ప్రకటన కూడా ఇవ్వడం జరిగింది.ఇటీవల గుంటుపల్లి సొసైటీలోనూ ఇదే రీతిలో అవినీతి జరిగిన విషయం తెలిసిందే. ఇలాంటి భారీ కుంభకోణాలను అరికట్టాలంటే సొసైటీలలో కంప్యూటరీకరణ జరగాల్సి న ఆవశ్యకత ఎంతైనా ఉంది.

## అయ్యానా కన్వెన్షన్ సెంటర్ కు 5 స్టార్ సర్టిఫికేషన్



**కంకిపాడు,అక్టోబరు 21 (వార్తాప్రభ) :** మండల కేంద్రమైన కంకిపాడు లోని అయ్యానా హోటల్ మరియు కన్వెన్షన్ సెంటర్కు 5 స్టార్ సర్టిఫికేషన్ అవార్డు వచ్చిందని అయ్యానా యాజమాన్యం చైర్మన్ మనోజ్ కుమార్ తెలిపారు. స్థానిక విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడుతూ వరల్డ్ స్టాండర్డ్ వీక్ ని పురస్కరించుకొని హెచ్. వై. ఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు అయ్యానా హోటల్ అండ్ కన్వెన్షన్ సెంటర్ పాటిస్తున్న పర్యావరణ విధానం, ప్రణాళిక నిర్వహణ, ఆహార భద్రత, పరిశుభ్రత, సౌర శక్తి ఉత్పత్తి, నీటి శుద్ధీకరణ మొదలు అంశాలను పరిశీలించి సంతృప్తి చెంది 5 స్టార్ సర్టిఫికేషన్ అవార్డుని మంగళవారం అయ్యానా కన్వెన్షన్ సెంటర్లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా అవార్డును తీసుకున్నామని తెలిపారు. అవార్డు ప్రకటించిన ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సమస్త ప్రతినిధులకు ఎండి రాజశేఖర్, యాజమాన్యం కృతజ్ఞతలు తెలియజేసినట్లు పేర్కొన్నారు.

## ఘనంగా మాజీ ఎంపీ పాటూరు రాజగోపాల్ నాయుడు 27వ వర్ధంతి వేడుకలు



**తిరుపతి,అక్టోబరు 21 (వార్తాప్రభ) :** తవణంపల్లి మండలం, దిగువమాఘం లో మాజీ ఎంపీ కీ.శే పాటూరు రాజగోపాల్ నాయుడు 27వ వర్ధంతి సందర్భంగా అమర రాజా వ్యవస్థాపక చైర్మన్ గల్లా రామచంద్ర నాయుడు, మాజీ మంత్రి వర్యులు గల్లా అరుణ కుమారి, అమర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి దిగువమాఘం గ్రామం నందు గల రాజన్న మెమోరియల్ పార్క రాజగోపాల్ నాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం,దిగువమాఘం సర్పంచ్ గోపి,మాజీ సర్పంచ్ కుమార్ నాయుడు , రాజన్న ఫౌండేషన్ నిర్వాహకులు సతీష్ రాళ్ళపల్లి, యల్లం పల్లి సురేష్ గారు మరియు గల్లా అభిమానులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అడ్వకేట్ బి రమేష్ యాదవ్ కు "భేరి" జన్మదిన శుభాకాంక్షలు



**హైదరాబాద్, అక్టోబరు 21 (వార్తాప్రభ) :** శేరిలింగంపల్లి బీసీ సంక్షేమ సంఘం మరియు ఐక్యవేదిక అధ్యక్షులు బి రమేష్ యాదవ్ అడ్వకేట్ ని తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ మరియు మిత్ర బృందం ఘనంగా సన్మానించడం జరిగింది. ఈరోజు మియాపూర్ అడ్వకేట్ రమేష్ యాదవ్ కార్యాలయంలో జన్మదినం వేడుకలు జరుపుకుంటున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్ర బిసి ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ మరియు బిసి ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్ మిత్రులందరూ కలిసి శేరిలింగంపల్లి అధ్యక్షులవారు అడ్వకేట్ రమేష్ యాదవ్ ని ఘనంగా సన్మానించడం జరిగింది. జన్మ దిన సందర్భాన్ని పురస్కరించుకొని బేరి రామచంద్ర యాదవ్ రమేష్ ని శాలువాతో మరియు పూల దండతో ఘనంగా సన్మానించి గొప్పగా ఎదగాలని, ప్రజా సేవ చేయాలని, లాయర్ గా ఉన్నందున పేద ప్రజలకు సేవ చేయాలని, ఆయురారోగ్యాలతో వర్ధిల్లుతూ సంతోషంగా నూరేళ్లు బ్రతకాలని భగవంతున్ని కోరడం జరిగింది. పెద్దలు ఆర్కే సాయి అన్నగారు బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు రమేష్ ని ఆశీర్వదిస్తూ పది కాలాలపాటు ఆయురారోగ్యాలతో వర్ధిల్లుతూ మంచి పేరు సంపాదిస్తూ ముఖ్యంగా పేద ప్రజానీకానికి సేవ చేస్తూ వకీల్ సాబు గా మంచి పేరు తెచ్చుకొని ఆనందకరమైన జీవితం గడపాలని నూరేళ్లు చల్లగా బ్రతకాలని భగవంతుని ప్రార్థించడం జరిగింది. జన్మదిన వేడుకల్లో బేరి రామచంద్ర యాదవ్ తెలంగాణ రాష్ట్ర బీసీ అధ్యక్షులు బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్, శేరి లింగంపల్లి ఉపాధ్యక్షులు నర్సింగ్ ముదిరాజ్ శేరిలింగంపల్లి కార్యదర్శి సత్యనారాయణ యాదవ్ చారి మహిళా అధ్యక్షురాలు పాల్గొని అడ్వకేట్ రమేష్ యాదవ్ ని సన్మానించడం జరిగింది బీసీ ఐక్యవేదిక సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు పెద్ద ఎత్తున బీసీ సంఘం నాయకులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

## పల్లెలు ప్రగతిని సాధించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

● పల్లె పండుగ ముగిసింది - ఇక ప్రగతి పనులు చేపట్టడమే - ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**నందిగామ,అక్టోబరు 21 (వార్తాప్రభ) :** పల్లెలు ప్రగతిని సాధించడమే ఎన్ డి ఏ కూటమి ప్రభుత్వ ధ్యేయమని స్థానిక శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని అడవిరాలపాడు, లింగాలపాడు, తక్కెళ్లపాడు గ్రామాలలో వరుసగా 20,25,20 లక్షల రూపాయలతో పలు అభివృద్ధి పనులకు జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తంబళ్లపల్లి రమాదేవితో కలిసి సౌమ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ ఊరూరా వేడుకగా జరిగిన పల్లె పండుగ వారోత్సవాలు ముగిశాయన్నారు. ఈనెల 14వ తేదీ నుండి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమాలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రజాప్రతినిధులు,అధికారులు శ్రీకారం చుట్టారన్నారు. ఈ పల్లె పండుగ కార్యక్రమంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో మరియు కాంపోనెంట్ నిధులతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులకు ప్రభుత్వం విధులను కేటాయించింది అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ గూటమి నాయకులు గ్రామస్థాయి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీకి అపోలో కృతజ్ఞతలు



**కాకినాడ,అక్టోబరు 21 (వార్తాప్రభ) :** అవయవాల రవాణాలో కోరిన వెంటనే గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసి ప్రాణదానానికి సహకరించిన జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ కు అపోలో ఆసుపత్రి అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. విక్రాంత్ పాటిల్ ను అపోలో హాస్పిటల్స్, కాకినాడ సీఈఓ ఐ వి రమణ, డిజిఎం జి వి ఆర్. మూర్తి కాకినాడ అపోలో హాస్పిటల్స్ ప్రముఖ అబ్డోమినల్ ఆర్గాన్ ట్రాన్స్ ప్లాంట్ సర్జన్ డా. జి వి రావు, కిడ్నీ స్పెషలిస్ట్ డా. సి హెచ్ అనిల్ కుమార్, ట్రాన్స్ ప్లాంట్ మత్తు డాక్టర్ డా. ప్రగాఢ నాగేశ్వరరావు,యూరోలాజిస్ట్ డా.సి హెచ్ కరుణాకర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి జ్ఞాపిక అందజేశారు.మూడు సార్లు జరిగిన ఈ గ్రీన్ ఛానల్ ద్వారా అవయవాలు అమర్చిన పేషెంట్స్ అందరు బాగా కోలుకున్నారని తెలిపారు.పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిభిరం ఏర్పాటు చేయాలనీ ఎస్పీ అపోలో హాస్పిటల్స్ డాక్టర్లును యాజమాన్యాన్ని కోరగా అపోలో యాజమాన్యం సమ్మతి తెలిపింది.త్వరలో ఆరోగ్య శిబిరం నిర్వహించుటకు ఏర్పాట్లు చేస్తామని ఎస్పీ ఆఫీస్ స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ కోటేశ్వరరావు తెలిపారు.

## హనుమాన్ జంక్షన్ స్టేషన్ ఎస్.ఐ,లుగా బాధ్యతలు స్వీకరించిన 1 సురేష్, 2 లక్ష్మీనరసింహ మూర్తి..



**హనుమాన్ జంక్షన్,అక్టోబరు 21 (వార్తాప్రభ) :** హనుమాన్ జంక్షన్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ గా వెలుగుల సురేష్ ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. 2012 బ్యాచ్ కు చెందిన సురేష్ కాకినాడ పోర్ట్ పోలీస్ స్టేషన్ నుండి బదిలీపై హనుమాన్ జంక్షన్ వచ్చారు. గతంలో పెద్దాపురం , మండపేట తదితర చోట్ల పని చేశారు. సురేష్ సోదరుడు కూడా కృష్ణాజిల్లా లో సర్కిల్ ఇన్స్పెక్టర్ గా పనచేస్తున్నారు. కాగా గత కొంత కాలంగా కాళీగా ఉన్న హనుమాన్ జంక్షన్ ఎస్. ఐ 2 గా నీలపాల లక్ష్మీ నరసింహ మూర్తి సోమవారం ఉదయం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ప్రసిద్ధి చెందిన శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానం లో పూజలు నిర్వహించారు. నరసింహ మూర్తి గుడివాడ తాలూకా పోలీస్ స్టేషన్ నుండి బదిలీపై ఇక్కడికి వచ్చారు. 2014 బ్యాచ్ కు చెందిన నరసింహ మూర్తి గతంలో విజయవాడ, ఘంటసాల తదితర చోట్ల పని చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఏ డి ఎల్ జనార్ధన్ గన్నవరం పోలీస్ స్టేషన్ కు బదిలీ అయ్యారు.

## పల్లెపాలెం లో ప్రపంచ అయోడిన్ అవగాహన లోప సదస్సు



**కృత్తివెన్ను,అక్టోబరు 21 (వార్తాప్రభ) :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పల్లె పాలెం నందు జరిగిన ప్రపంచ అయోడిన్ లోప అవగాహనా సదస్సు నిర్వహించారు.ఇన్ ఛార్జ్ ప్రధాన ఉపాధ్యాయుడు కొప్పినీడి సూర్య ప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సు లో హెల్త్ ఎడ్యుకేటర్ ప్రభావతి మాట్లాడుతూ అయోడిన్ లోపం వల్ల కలిగే సమస్యల పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.అయోడిన్ లోపం వల్ల బుద్ధి మాంద్యం,గాయటర్,పిల్లలలో మెటబాలిజం లోపం,థైరాయిడ్ రావడం మొదలైన వాటికి గురవ్వుతారని,13 సంవత్సరాల లోపు వయస్సు పిల్లలు 120mg 13 పైబడిన వయస్సు వారు150mg అయోడిన్ సాల్ట్ తీసుకోవాలని కోరారు.ఈ సదస్సు లో ఏ ఎన్ ఎం సత్యవతి ఆశా వర్కర్లు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## క్లాప్ ఆటోలను నిలిపివేయడం సరికాదు

● వైసీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు



**విజయవాడ సెంట్రల్,అక్టోబరు 21 (వార్తాప్రభ) :** మున్సిపాలిటీలలో క్లాప్ (క్లీన్ ఆంధ్రప్రదేశ్) వాహనాలను నిలిపివేయడం సరికాదని.. ప్రభుత్వమే వాటిని నడపాలని వైసీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు డిమాండ్ చేశారు. చెత్త తరలించే వాహనాలు నిలిచిపోవడంతో నివాసాలలో పెద్దఎత్తున చెత్త పేరుకుపోయి ప్రజలందరూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో క్లాప్ కార్యక్రమం ఎంతగానో విజయవంతమైందని.. విజయవాడ నగరానికి జాతీయ స్థాయిలో అనేక అవార్డులు సైతం వచ్చినట్లు గుర్తుచేశారు. అటువంటి కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం నీరుగారుస్తోందని ఆరోపించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్యం విషయంలో ప్రభుత్వ నిర్ణయాలు ఉండాలి తప్ప ప్రజలను ఇబ్బంది పెట్టే రీతిలో కాదని దుయ్యబట్టారు. ఫలితంగా కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలలోని నగరాలు, పట్టణాలలో పరిస్థితి దయనీయంగా మారిందని.. వీధుల్లో ఎక్కడికక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయన్నారు. పైగా మారిన వాతావరణ పరిస్థితుల్లో నగరంలో జ్వరాలు విజృంభిస్తున్నాయని.. ప్రజలందరూ డయేరియా భయంతో వణికిపోతున్నారని చెప్పారు. విజయనగరంలో డయేరియా బారిన పడి 11 మంది మృత్యువాతపడినా.. ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా కూడా లేదని మండిపడ్డారు. చాలా చోట్ల ప్రజలు జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడుతూ ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్కిల్ - 2 పరిధిలో రోజుకీ దాదాపు 200 టన్నుల చెత్తను 90 వాహనాల ద్వారా బయటకు తరలిస్తున్నట్లు చెప్పారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆటోలు రాక చెత్త ఎక్కువ రోజులు ఇళ్లల్లోనే ఉండిపోతే.. మరిన్ని వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. కనుక ప్రభుత్వం తక్షణమే క్లాప్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించి.. వాహనాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

## పోలియో వ్యాధిపై అప్రమత్తత అవసరం - డాక్టర్ పి సతీష్ కుమార్



**విశాఖపట్నంఅక్టోబరు 21 (వార్తాప్రభ) :** పోలియో వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ప్రముఖ శిశు వైద్యులు, సత్య చైల్డ్ క్లినిక్ నియోనాటాలజిస్ట్ డాక్టర్ పి. సతీష్ కుమార్ అన్నారు. ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీకా ద్వారా నివారించగల వ్యాధిపై పోరాటానికి అందరూ ఏకం కావాల్సి వుందన్నారు. భారతదేశంలోని మేఘాలయలో ఇటీవల బయట పడిన పోలియో కేసు నేపథ్యంలో, ఈ ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా, పోలియోమైలిటిస్ వల్ల కలిగే నిరంతర ముప్పును గుర్తించడం చాలాఅవసరం అన్నారు. పోలియో, ఒక తీవ్రమైన వైరల్ అంటువ్యాధి. ప్రధానంగా ఐదేళ్లలోపు పిల్లలను ప్రభావితం చేస్తుందని, ఇది కోలుకోలేని పక్షవాతం మరియు కొన్ని సందర్భాల్లో మరణానికి దారితీస్తుందన్నారు. దశాబ్దాలుగా పురోగతి ఉన్నప్పటికీ, ఈ వ్యాధి ప్రపంచ ఆరోగ్యానికి ముప్పుగా మాత్రం మిగిలిపోయిందని, ముఖ్యంగా పోలియో రహిత భారతదేశం వంటి దేశాలలో ఇది మరలారాకుండా నివారించడానికిఅప్రమత్తంగా ఉండాలన్నారు. ఇన్యాక్టివేటెడ్ పోలియో వ్యాక్సిన్ (ఐపివి) పిల్లలను దాని వినాశకరమైన ప్రభావాల నుండి రక్షించడానికి మనం కలిగి ఉన్నఅత్యంత ప్రభావవంతమైన సాధనంగా నిలిచింది" అని అన్నారు. డాక్టర్ కుమార్ మాట్లాడుతూ, "పోలియో రహిత హోదాఅంటే ప్రతిచోటా పోలియో తొలగించబడుతుందని కాదని, ప్రపంచ ప్రయాణాలు వలసలువంటివి ప్రమాదాన్ని పెంచుతాయని, ఆరు వారాల తరువాత టీకాలు వేయించటం ముఖ్యం" అని అన్నారు. పోలియో వ్యాక్సిన్ (ఐ టి వి), 16-18 నెలలలో మళ్లీ 4-6 సంవత్సరాలలో బూస్టర్లు వేయించాలని తెలిపారు .

## పల్లెలు ప్రగతి సాధనకు కృషి



**కంకిపాడు,అక్టోబరు 21 (వార్తాప్రభ) :** మండలంలోని పునాదిపాడు గ్రామంలో బోడె ప్రసాద్ కాలనీలో సిసి రోడ్లు మరియు డ్రైనేజీ నిర్మాణానికి ఎన్. ఆర్.జిఎస్ 52 లక్షల నిధులతో నిర్మాణం చేపట్టబోయే కార్యక్రమానికి పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యులు బోడే ప్రసాద్ తనయుడు బోడ వెంకటరామ్ పూజ చేసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెలు ప్రగతి సాధించడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు సుదిమల్ల రవీంద్ర, టిడిపి, కూటమి నాయకులు కె.కరుణ, పులి శ్రీనివాసరావు, ముసుబోయిన బాబు, మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరావు, వి.భాను తదితరులు పాల్గొన్నారు.

## మండలంలోని పలు గ్రామాల్లో పల్లె పండుగ

● అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రజాప్రతినిధులు



**పెడన,అక్టోబరు 21 (వార్తాప్రభ) :** మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం నాడు అభివృద్ధి పనులకు శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు మండల ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలు చేశారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఈ శంకుస్థాపనలు జరిగాయి. దాదాపు కోటి రూపాయలకు పైగా నిధులకు సంబంధించి చేపట్టవలసిన పనులను నాయకులు ప్రారంభించారు. మడక బల్లిపర్రు కాకర్లమూడి నందిగామ పెనుమల్లి నేలకొండపల్లి కొంగంచర్ల గురువిందగుంట ముచ్చర్ల కొప్పెర్ల కమలాపురం చేవెంద్ర ఉరివి లంకల కలవగుంట పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి అర్జా వెంకట నగేష్ మండల టిడిపి అధ్యక్షుడు శలపాటి ప్రసాద్ ప్రధాన కార్యదర్శి శీరం ప్రసాద్ ఈ వో ఆర్ డి జయరాముడు ఆయా గ్రామాల స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# అందరం కలిసి కొత్త గుడివాడను రూపొందిద్దాం : ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

● మున్సిపల్ అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే రాము..

శానిటేషన్, త్రాగునీటి సమస్యలపై అధికారులు టాప్ ప్రయారిటీ ఇవ్వాలి.. ఎమ్మెల్యే రాము




**గుడివాడ,అక్టోబరు 21 (వార్తాప్రభ) :** ప్రజల భాగస్వామ్యంతో.. అధికారులు.. ప్రజా ప్రతినిధులందరం కలిసి కొత్త గుడివాడని రూపొందించుకోవాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పిలుపునిచ్చారు. పట్టణం లోని ప్రజా సమస్యలపై పురపాలక సంఘ సమావేశ మందిరంలో.. అధికారులతో ఎమ్మెల్యే రాము రివ్యూ సమావేశం నిర్వహించారు. పట్టణంలో శానిటేషన్ అస్తవ్యస్తంగా ఉండటాన్ని ఎమ్మెల్యే రాము ప్రశ్నించారు.. అధికారుల సమాధానంతో సంతృప్తి చెందని ఎమ్మెల్యే.. సాకులు చెప్పవద్దని శానిటేషన్ మెరుగుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అంశాల వారీగా శానిటేషన్, వాటర్ వర్క్స్, రెవెన్యూ, పబ్లిక్ హెల్త్ అధికారులతో.. ఆయా శాఖల్లో నెలకొని ఉన్న సమస్యలపై ఎమ్మెల్యే రాము మాట్లాడారు. ఇటీవల జరిగిన బదిలీలలో భాగంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధికారులు పట్టణ సమస్యలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని.. ప్రజల సమస్యలను పరిష్కరించడమే కోలమానంగా పనిచేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము అధికారులతో అన్నారు. బాధ్యతగా పనిచేసే అధికారులకు గుర్తింపు వచ్చేలా ప్రోత్సహిస్తానని.. గుడివాడ మార్పు కోసం, నేను చేసే కృషిలో అధికారులు భాగస్వామ్యులు కావాలని సమావేశంలో ఆయన పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే రాము మీడియాతో మాట్లాడారు. గత ఐదేళ్లుగా గుడివాడ పురపాల సంఘ అడ్మినిస్ట్రేషన్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయ్యిందని.. అస్తవ్యస్తంగా ఉన్న గుడివాడను అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తున్నానని ఎమ్మెల్యే రాము అన్నారు. ప్రధానంగా శానిటేషన్ వ్యవస్థను మెరుగుపరచడం మరియు ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించేందుకు అధిక ప్రాధాన్యతనిస్తూ కృషి చేస్తున్నామన్నారు. గత 5ఏళ్లుగా పెద్ద ఎత్తున జరిగిన అవినీతి కారణంగా.. గుడివాడలో శానిటేషన్ పెద్ద సమస్యగా మారిందన్నారు. వచ్చే వేసవిలోపు త్రాగునీటి సమస్యలను పరిష్కరించి.. ట్యాంకర్లు లేకుండా ప్రతి ఇంటికి శుభ్రమైన నీటిని అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ రివ్యూ సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, గుడివాడ జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమిషనర్ పి శ్రీనివాస్, పబ్లిక్ హెల్త్ డి.ఈ పాండురంగారావు, పురపాలక సంఘ ఇంజనీరింగ్ ,శానిటేషన్, రెవెన్యూ విభాగాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విశ్వబ్రాహ్మణ స్వర్ణకారుల షష్టి పూర్తి కల నెరవేర్చిన సీఎం చంద్రబాబు..

**గుడివాడ,అక్టోబరు 21 (వార్తాప్రభ) :** గత ఎన్నికల హామీలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమ వాగ్దానాన్ని ఆంధ్రప్రదేశ్ స్వర్ణకారుల సంక్షేమ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం ద్వారా నిలబెట్టుకోవడం తమ పరిపాలనా నిబద్ధతకు, దక్షతకు నిలువెత్తు నిదర్శనమనీ ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం, కృష్ణా జిల్లా అధ్యక్షులు చింతలూరి సత్యనారాయణ అన్నారు. సోమవారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వర్ణకారులంటే వేదాల ప్రకారం విశ్వబ్రాహ్మణులేననీ, జీవనోపాధి కోసం ఇతరులు సహితం ఇందు ప్రవేశం జరిగన దరిమిలా విశ్వబ్రాహ్మణులకు పెద్దపీట వేయవలసినదిగా వారు విజ్ఞప్తి చేశారు. పంచ వృత్తులలో భాగమైన వడ్రంగి, కంచర, కుమ్మరి, శిల్ప వృత్తులకు కూడా తగు ఉపాధి అవకాశాలు కల్పించేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు. పట్టం కట్టిన ప్రజలకు లబ్ధి చేకూర్చే కార్యక్రమాల్లో భాగంగా ప్రత్యేకంగా స్వర్ణకారులకు సంక్షేమాభివృద్ధి కార్పోరేషన్ ను క్యాబినెట్ సమావేశంలో మంత్రి మండలి ఆమోదంతో ఏర్పాటు చేయడం సంతోషించిన విషయమనీ ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం, కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి డా॥ పుల్లేటికుర్తి ఎస్.వి. శ్రీను బాబు అన్నారు. తద్వారా విశ్వబ్రాహ్మణ స్వర్ణకారులు ఆర్థికంగా, సామాజికంగా ఎదుగుదలకు తోడ్పడుతుందనీ, ఈ సందర్భముగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం, కృష్ణా జిల్లా గౌరవ అధ్యక్షులు ధవళేశ్వరపు ఉమామహేశ్వర రావు, ఉపాధ్యక్షులు వరదా వెంకటేశ్వర రావు, కోశాధికారి చిట్టూరి ప్రవీణ్, సంయుక్త కార్యదర్శి మానేపల్లి గిరిధర్, కార్యవర్గ సభ్యులు మండపాక ప్రకాష్, గౌరవ సలహా సభ్యులు గుంటముక్కల రామబ్రహ్మం, ఎం.ఎస్. ప్రకాశ రావు, ముంతా వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# యువ కవులను ప్రోత్సహించడానికి కృషి..!

● సాహితీ మిత్రులు కన్వీనర్ వసుధ..



**గుడివాడ,అక్టోబరు 21 (వార్తాప్రభ) :** యువతలో సాహిత్యాభిరుచిని పెంపొందించడానికి, వారి చేత కవిత్వ రచన చేయించడానికి కృషి చేయనున్నట్టు పట్టణ సాహితీ మిత్రులు సంస్థ కన్వీనర్ కవి రచయిత "వసుధ" బసవేశ్వరరావు వెల్లడించారు. ఆదివారం రాత్రి పట్టణం లోని సి ఐ టి యు కార్యాలయంలో పలు సాహితీ సంస్థల ప్రతినిధులతో కలిసి చర్చించారు. ప్రతి నెలా మూడవ ఆదివారం సాయంత్రం కళాశాలల విద్యార్థులతో, యువకవులతో కలిసి సమ్మేళనాన్నీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. అందులో స్థానిక సీనియర్ కవుల కవితలు వినిపించడంతో పాటు కొత్త కవులకు కవిత్వం పట్ల అవగాహన కల్పించి మార్గదర్శక సూత్రాలను శిక్షణ రూపంలో తెలియజేస్తామన్నారు. ఇందులో వివిధ పాఠశాలలు కళాశాలల యాజమాన్యాల సహకారాన్ని కోరతామన్నారు. సాహిత్య పరంగా గుడివాడ కున్న ప్రాధాన్యత ను పునరుద్ధరించేలా కృషి చేస్తామన్నారు. ఈవిషయంలో వివరాలు కావలసిన వారు 9490832787 నంబరు కు ఫోన్ చేసి సంప్రదించవచ్చన్నారు. ఈ సభలో సాహితీ మిత్రులు సాహితీ స్రవంతి సంస్థల ప్రతినిధులు లంక సురేంద్ర, కృష్ణ కిషోర్ మరియ పీటర్, కవులు కొమ్ముల సురేష్, అవిర్నేని వెంకటేశ్వర రావు, బి.వి.శ్రీనివాస్, యలమర్తి కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయాలను పంచాయతీలకు అనుసంధానం చేయాలి

● పెరికపాడు సర్పంచ్ మన్నె సాత్విక



**కంచికచర్ల,అక్టోబరు 21 (వార్తాప్రభ) :** గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగులను, సిబ్బందిని గ్రామ పంచాయతీ లకు అనుసంధానం చేయాలని ఎన్టీఆర్ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ నిధి మీనా కు వినతిపత్రం సమర్పించిన పెరికపాడు సర్పంచ్ మన్నే సాత్విక ఈ సందర్భంగా సాత్విక మాట్లాడుతూ..గత ప్రభుత్వం గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రతి సచివాలయంలో 11 మంది ఉద్యోగులను నియమించి వారిపైన సరైన పర్యవేక్షణ, నియంత్రణ లేక సచివాలయ వ్యవస్థ తీవ్ర గందరగోళంగా తయారైందని, గ్రామ పంచాయతీ పరిధిలో రెండు నుంచి ఐదు సచివాలయాలు ఏర్పాటు చేశారని,అవసరం కంటే మించి ఉద్యోగులు ఉన్నందున వారికి పని లేకుండా పోయిందని అంతే కాకుండా వారికి జీతాలు ఇచ్చేది ఒకరు, పనిచేయాలని ఆదేశించేది ఇంకొకరు. వాటిలో పని చేసే ఉద్యోగులు ఎవరి ఆదేశాలు పాటించాలో తెలియని పరిస్థితిలో ఉన్నారన్నారు. ఈ వ్యవస్థ పూర్తిగా రాజ్యాంగ వ్యతిరేకంగా చట్ట వ్యతిరేకంగా రూపకల్పన జరిగిందని దీనికి పరిష్కారంగా గ్రామ పంచాయతీకి ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసి సచివాలయంలో పనిచేసే సిబ్బందిని గ్రామపంచాయతీ ఆధీనంలో ఉంచాలని ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ ఛాంబర్ మరియు రాష్ట్ర సర్పంచుల సంఘం జిల్లా, రాష్ట్ర కమిటీలు, మా వ్యవస్థాపక అధ్యక్షులు వై.వి.బి రాజేంద్రప్రసాద్ నాయకత్వంలో సచివాలయ వ్యవస్థ పై గత రాష్ట్ర ప్రభుత్వానికి అనేకసార్లు వినతి పత్రాలు సమర్పించి, పోరాటాలు, ఉద్యమాలు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. నూతనంగా ఏర్పడిన ఎన్డీఏ కూటమి రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ , జిల్లా కలెక్టర్ గారైన మీ ద్వారా గ్రామ పంచాయతీకి ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసి ఆ సచివాలయ సిబ్బందిని గ్రామ పంచాయతీకి అనుసంధానం చేయాలని వినతిపత్రం సమర్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణాజిల్లా సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు గోలి వసంత కుమార్, పెరకలపాడు సర్పంచ్ మన్నె సాత్విక తదితరులు పాల్గొన్నారు.

# వాహన తనిఖీలు చేసిన ఎస్ఐ నాగరాజు..



**గుడివాడ,అక్టోబరు 21 (వార్తాప్రభ) :** స్థానిక ఏ.జి.కే స్కూల్ వద్ద టూ టౌన్ ఎస్.ఐ పి.నాగ రాజు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియా తో మాట్లాడుతూ పట్టణం లోని మైనర్ లకు వాహనాలు ఇచ్చి రోడ్ల మీదకు పంపితే వాహనాలు సీజ్ చేసి తల్లిదండ్రులు మీద చట్టపరమైన చర్యలు తీసుకుంటామని.. అలాగే హెల్మెట్, వాహన రికార్డులు అన్ని సక్రమంగా లేని యెడల వాహనాలకు పెద్ద మొత్తాల్లో జరిమానా వేస్తామని చంటిబాబు హెచ్చరించారు.

# మానవతా ఆధ్వర్యంలో వరద బాధితులకు పుస్తకాల పంపిణీ..




**హనుమాన్ జంక్షన్,అక్టోబరు 21 (వార్తాప్రభ) :** ఈరోజు మానవతా ఆంధ్రప్రదేశ్ శాఖ వారి ఆధ్వర్యంలో విజయవాడలోని వరద బాధిత విద్యార్థులకు రెండవ విడతగా 6000 పుస్తకాలను కండ్రికలోని బివి సుబ్బారెడ్డి నగరపాలకు ఉన్నత పాఠశాలకు మరియు ప్రకాష్ నగర్ లోని పుచ్చలపల్లి సుందరయ్య మెమోరియల్ హైస్కూల్లోని విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేయడమైనది ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అమరావతి బాలోత్సవ్ అధ్యక్షులు శ్రీ మురళీకృష్ణ పాల్గొన్నారు మానవతా రాష్ట్ర కన్వీనర్ మారు బోయిన కోటేశ్వరరావు ఉమ్మడి కృష్ణాజిల్లా ట్రెజరర్ శ్రీ జెన్యావుల వివి సత్యనారాయణ విజయవాడ ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, కార్యదర్శి రాము,ట్రెజరర్, కార్యవర్గ సభ్యులు దుర్గాప్రసాద్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆంధ్ర రత్న అవార్డును స్వీకరించిన డాక్టర్ నాగరాజు మాస్టర్




**జి.కొండూరు,అక్టోబరు 21 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా,జి.కొండూరు మండలం, జి.కొండూరు గ్రామానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు కవి డాక్టర్ పెదగమళ్ళ నాగరాజు సుప్రసిద్ధమైన ఆంధ్ర రత్న అవార్డును సోమవారం విజయవాడలో అందుకున్నారు.అఖిలభారత సాంస్కృతిక సంస్థ మరియు ఆంధ్రప్రదేశ్ కల్చరల్ సొసైటీ వారు 2024వ సంవత్సరం గాను సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలుగు సాహిత్య సేవ ఉత్తమ విద్యా బోధనలో ఈ అవార్డును స్వీకరించారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత సాంస్కృతిక సేవా సంస్థ చైర్మన్ డాక్టర్ విజయకుమార్ మెజిస్ట్రేట్ శంకర్ ప్రముఖ కన్నడ తెలుగు సినీ నటి పంకజం కౌన్సిలర్ సునీత ప్రముఖ నాట్య కళాకారిణి వాణి ఈ అవార్డులు అందించారు.గతంలో వీరు ఆచార్య దేవోభవ, గుర్రం జాషువా స్మారక అవార్డు,డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అవార్డు, ఉగాదిపురస్కారాలు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గురుబ్రహ్మ అవార్డు ఢిల్లీలో డాక్టరేట్ మరియు తదితర ప్రముఖులచే సత్కారాలు అవార్డులను పొందారు.ఆంధ్ర రత్న అవార్డును పొందిన డాక్టర్ నాగరాజు ను మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అభినందించారు. రానున్న రోజులలో మరిన్ని సత్కారాలు అవార్డులు పొందాలని ఆకాంక్షించారు. జి.కొండూరు మండలంలో పలువురు ప్రముఖులు ఉపాధ్యాయులు ఉపాధ్యాయ సంఘం నాయకులు తదితరులు నాగరాజు మాస్టర్ కి అభినందనలు తెలియజేశారు.గతంలో జి.కొండూరు గ్రామాన్ని ఢిల్లీ వరకు తీసుకువెళ్లి నేడు ఆంధ్ర రత్న అవార్డును స్వీకరించినందుకుగాను పలువురు గ్రామస్తులు పూర్వ విద్యార్థులు ఆయన కు ప్రత్యేక అభినందనలు తెలియజేశా రు.

# మడకలో యువకుడు మృతి

● గొడవకు కారణంగా పలు రకాల కథనాలు ● దర్యాప్తులో గాని తేలని అసలు విషయం




**పెడన,అక్టోబరు 21 (వార్తాప్రభ) :** ఇరువురి మధ్య ఏర్పడిన వివాదంలో ఒక యువకుడు మృతికి దారితీసింది. పెడన మండలం మడక గ్రామంలో ఈ సంఘటన జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పి ఆశీర్వాదం (38 ) ప్రైవేటు బస్సు డ్రైవర్ గా పని చేస్తూ ఉంటాడు. ఈ గ్రామానికి చెందిన జోగి ఆమోష్ తో పాటు మరో ముగ్గురు వ్యక్తులతో ఆదివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో సచివాలయ భవనం వద్ద గొడవ జరిగింది. ఈ ఘర్షణలో ఆశీర్వాదం కు దెబ్బలు తగిలాయి. అనంతరం అతను ఇంటికి వెళ్లి తనపై దాడి జరిగిందని చెప్పి స్పృహ తప్పి పడిపోయాడు. కంగారుపడిన కుటుంబ సభ్యులు వెంటనే 108 కు ఫోన్ చేశారు. అది వచ్చేదాకా ఆగకుండా ఆటోలో అతన్ని మచిలీపట్నంకు తరలించే క్రమంలో పెడన సమీపంలో 108 వాహనం ఎదురు వచ్చింది. ఆశీర్వాదాన్ని ఆ వాహనంలోకి ఎక్కించే ప్రయత్నంలో వాహన సిబ్బంది అతన్ని పరీక్షించారు. అయితే ఆశీర్వాదం అప్పటికే చనిపోయినట్టుగా సిబ్బంది నిర్ధారించారు.మృతుడిని తిరిగి ఇంటికి తీసుకువచ్చారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సిఐ నాగేంద్రప్రసాద్ పెడన ఏఎస్ఐ లక్ష్మణరావు బంటుమిల్లి ఎస్ఐ గణేష్ గ్రామానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.భార్యతో పాటు పాప బాబు ఉన్నారు. మృతుడు చనిపోవడానికి కారణాలు పై గ్రామంలో పలు రకాల కథనాలు వినిపిస్తున్నాయి. పోలీసుల విచారణలో విషయం తేల నుంది. పోలీసులు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

# తారకరామా పంపు హౌస్ లో చోరీ

● బేరింగ్ సాఫ్ట్, గన్ మెటల్ వీల్స్ ను దొంగిలించిన గుర్తు తెలియని దుండగు లు

● పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన ఇరిగేషన్ ఏఈ వెంకటేష్

**జి.కొండూరు,అక్టోబరు 21 (వార్తాప్రభ) :** మండలంలోని పినపాక గ్రామ శివారు విద్యానగరం సమీపంలో తారకరామా ఎత్తిపోతల పథకం మూడో పంపు హౌస్ లో చోరీ జరిగింది.గుర్తు తెలియని దుండగులు పంపు హౌస్ తాళాలు పగలగొట్టి లోపల ఉన్న బేరింగ్ సాఫ్ట్ ,5 గన్ మెటల్ వీల్స్, నట్లు, బోల్టు లు అపహరించారని ఇరిగేషన్ ఏఈ వెంకటేష్ 3వ పంపు హౌస్ ఆపరేటర్ జె. రమేష్ తో కలిసి సోమవారం జి.కొండూ రు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఒక్కొక్క బేరింగ్ సాఫ్ట్ 40 కిలోలు ఉంటుందని తెలిపారు.గన్ మెటల్ వీల్స్ ఖరీదు ఎక్కువ ఉంటాయని వీటి విలువ సుమారు రూ.1.50 లక్షల వరకు ఉండ వచ్చని ఏఈ తెలిపారు. అయితే ఈ నెల 18వ తేదీన ఇద్దరు వ్యక్తులు పంపు హౌస్ వద్ద టచ్ ఆడుతుండటం చూశానని ఆపరేటర్ తెలిపాడు.

# రోడ్ల మీదకు గోవుల్ని రాకుండా చర్యలు గైకొనాలి..



**గుడివాడ,అక్టోబరు 21 (వార్తాప్రభ) :** సోమవారం రోడ్ల మీదకు గోవుల్ని రాకుండా చర్యలు తీసుకోవాలని గుడివాడ మున్సిపల్ కమిషనర్ కి వినతిపత్రం అందజేసిన గుడివాడ పట్టణ ఆర్.కె. వారియర్స్.. ఈ సందర్భంగా సామాజికవేత్త డాక్టర్ మాచర్ల రామకృష్ణ (ఆర్.కె.) మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా గుడివాడ పట్నంలో ప్రధానమైన సమస్య గోవులు రోడ్ల మీదకు రావడంతో వాహనదారులు మరియు ప్రజలు ఇబ్బంది పడడంతో ఆ సమస్యను ఎన్నోసార్లు వినతి పత్రాలు ద్వారా పోరాటాల ద్వారా తెలియజేసిన ప్రభుత్వ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం చాలా బాధాకరమన్నారు. దయచేసి గుడివాడ పట్టణ ప్రజల సమస్యని గుర్తించి యుద్ధ ప్రాతిపదికంగా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుని గోవుల్ని రోడ్లమీద రాకుండా కట్టడి చేయాలని కోరారు. సమస్యని చెప్పిన వెంటనే మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించి రెండు రోజుల్లో ఈ సమస్యని తీరుస్తావని హామీ ఇవ్వడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్. కె. వారియర్స్ మరియు భవిష్యత్తు భద్రత దళం సభ్యుడు మహమ్మద్ తాహిర్ భాష పాల్గొన్నారు.

# విద్యాలయ డైరెక్టర్ విజయభాస్కర్ కు ప్రతిష్టాత్మక డాక్టర్ అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభ అవార్డు ప్రధానం..



**గుడివాడ,అక్టోబరు 21 (వార్తాప్రభ) :** రాష్ట్ర లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆంధ్రప్రదేశ్ (ఎస్పిఎల్టిఓ) ఆధ్వర్యంలో అక్టోబర్ 20వ తేదీన గుంటూరు ఏసీ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ అవార్డు ను 2024 సంవత్సరానికి గాను గుడివాడ విద్యాలయ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ బొప్పన విజయభాస్కర్ అందుకున్నారు. శాసనమండలి సభ్యులు కె. స్ లక్ష్మణరావు మరియు మలినేని గ్రూప్స్ అధినేత మలినేని పెరుమాళ్ళు, ఎస్పిఎల్టిఓ రాష్ట్ర అధ్యక్షుడు నాగయ్య పర్యవేక్షణలో విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తు మంచి ఫలితాలు పొందుతూ విద్యారంగంలో విద్యార్థులను ఆల్‌రౌండర్లుగా తీర్చిదిద్దుతున్న విద్యాలయ డైరెక్టర్ విజయభాస్కర్ కి అవార్డు వరించింది. ఈ అవార్డును గుంటూరు వెస్ట్ శాసనసభ్యులు గల్లా మాధవి, ఈస్ట్ శాసనసభ్యులు నసీర్ అహ్మద్ ప్రత్తిపాడు శాసనసభ్యులు రామాంజనేయులు, తాడికొండ శాసనసభ్యులు శ్రావణ్ కుమార్ ల చేతుల మీదగా విద్యాలయ డైరెక్టర్ విజయభాస్కర్ తరఫున విద్యాలయ అకాడమిక్ అడ్వైజర్ పోలవరపు షరేన్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏసీ కళాశాల ప్రిన్సిపల్ మోజెస్ బాబు, వైస్ ప్రిన్సిపల్ అమృతవల్లి, డాక్టర్ కన్నా మాస్టర్, కాటూరి వెంకటేశ్వరరావు, మేకల రవీంద్రబాబు మరియు వివిధ రాష్ట్రాలకు చెందిన ఉపాధ్యాయులు లెక్చరర్లు హాజరై వారిని అభినందించడం జరిగింది.

# 27 న ఆరుద్ర శత జయంతి సభ - సాహితీ సంస్థల నిర్వహణ

**గుడివాడ,అక్టోబరు 21 (వార్తాప్రభ) :** సుప్రసిద్ధ సాహితీ వేత్త, భాషా పరిశోధకుడు, సినీ గేయ రచయిత ఆరుద్ర శత జయంతి సభలను సాహితీ స్రవంతి పక్షాన రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర సాహితీ స్రవంతి ప్రధాన కార్యదర్శి కె. సత్యరంజన్ ప్రకటించారు. ఇందులో భాగంగా గుడివాడ లోని అన్ని సాహితీ సాంస్కృతిక కళా సంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 27 వ తేదీన ఏ. జి కె మునిసిపల్ హైస్కూల్ లో నిర్వహిస్తున్నట్టు తెలియ జేశారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లలో భాగంగా ఆదివారం సాయంత్రం సి.ఐ.టి.యు. కార్యాలయంలో స్థానిక సాహితీ సంస్థల ప్రతినిధులతో మాట్లాడారు. ఆరుద్ర శత జయంతి సభలను విజయవంతంగా నిర్వహించడం తెలుగు వారందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో జాషువా సాంస్కృతిక వేదిక కార్యదర్శి గుండు నారాయణ రావు, జిల్లా సాహితీ స్రవంతి నాయకులు చింతా శ్రీరాములు, పట్టణ సాహితీ స్రవంతి, సాహితీ మిత్రులు ప్రతినిధులు లంక సురేంద్ర, యలమర్తి కోటేశ్వర రావు, కవులు జి.మరియ పీటర్, కృష్ణ కిషోర్, కొమ్ముల సురేష్, గాయకుడు అవిర్నేని వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.


**In the Court of Principal Civil Judge (Junior Division) At Vijayawada**
O.S. No. 340/2022
Between :-
State Bank of India,
Krishnalanka Branch,
Vijayawada ... Plaintiff
AND
Vadde Bhagya Lakshmi,
Daughter of Ramu,
61-25-16/5, Sudha Residency,
Eenadu Colony,
Ramalingeswara Nagar,
Vijayawada.
... Defendant
Defendant take Suit Summons in the above Suit filed against You, by the Plaintiff for realization of the Suit Amount of Rs. 5,69,589/- Due under the Loan Account No. 37982248464 and the said Suit stands posted to 28-10-2024 for Your appearance. Appear before the Hon'ble Court on that Day at 10-30 A.M., Personally or through an Advocate. Else next step follows.
(By Order)
T.V.N. VASUDEVA RAO
Advocate for Plaintiff
Gudivada Vari Street,
Vijayawada-520001.
21-10-2024

**In the Court of Principal Civil Judge (Junior Division) At Vijayawada**
O.S. No. 1553/2021
Between :-
State Bank of India,
RACPC-I, Vijayawada
... Plaintiff
AND
Chennamsetty Janaki Radha,
Wife of Venkata Siva
Satyanarayana,
D.No. 1-47, Yadava Bazar,
Perikigudem, Mandavalli - 521 034.
... Defendant
Defendant take Suit Summons in the above Suit filed against You, by the Plaintiff for realization of the Suit Amount of Rs. 1,18,367/- Due under the Loan Account No. 35826659874 and the said Suit stands posted to 25-10-2024 for Your appearance. Appear before the Hon'ble Court on that Day at 10-30 A.M., Personally or through an Advocate. Else next step follows.
(By Order)
T.V.N. VASUDEVA RAO
Advocate for Plaintiff
Gudivada Vari Street,
Vijayawada-520001.
21-10-2024


Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188